మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 21-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 353 Issue: 353

21 జూన్ 2026 - ఆదివారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:46, సూర్యాస్తమయం - సా. 6:49, , తిథి, సప్తమి మ. 3:26 వరకు, తరువాత అష్టమి, సంస్కృత వారం, భాను వాసరః, నక్షత్రం, పూర్వ ఫల్గుని(పుబ్బ) ఉ. 9:30 వరకు, తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర), యోగం, సిద్ధి ఉ. 11:19 వరకు, కరణం. వనిజ మ. 3:26 వరకు, విష్టి తె. 3:260 వరకు, వర్జ్యం, సా. 4:58 నుండి సా. 6:37 వరకు, దుర్ముహూర్తం, సా. 5:04 నుండి సా. 5:56 వరకు, రాహుకాలం, సా. 5:11 నుండి సా. 6:49 వరకు, యమగండం, మ. 12:17 నుండి మ. 1:55 వరకు, గుళికాకాలం, మ. 3:33 నుండి సా. 5:11 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:10 నుండి తె. 4:58 వరకు, అమృత ఘడియలు, రా. 2:54 నుండి తె. 4:33 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:51 నుండి మ. 12:44 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



**దాదాపు 20 లక్షల పదాలు..**
**1.83 లక్షల వాక్యాలు..**
**కృత్రిమ మేధ సాయంతో..**
**మెదడు సంకేతాలు మాటలుగా మారాయి!**

*అమియోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్ (లౌ గెహ్రింగ్ వ్యాధి-ఏఎల్ఎస్) అనే నాడీ క్షీణత వ్యాధి కారణంగా తన గొంతును పూర్తిగా కోల్పోయిన అమెరికాకు చెందిన కేసీ హారెల్ అనే వ్యక్తి, మెదడులో అమర్చిన ప్రయోగాత్మక ఇంప్లాంట్ సహాయంతో మళ్లీ సంభాషించే సామర్థ్యాన్ని పొందాడు. గత దాదాపు రెండేళ్లలో అతడు ఈ సాంకేతికత ద్వారా 19.6 లక్షలకు పైగా పదాలు మాట్లాడి, బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాడు.*

# చిప్పు మాట్లాడింది!

## మెదడు ఇంప్లాంట్‌తో మళ్లీ మాటల ప్రపంచంలోకి

### ఏఎల్ఎస్ రోగి జీవితాన్ని మార్చిన సాంకేతికత.. నిమిషానికి సగటున 56 పదాల వేగంతో సంభాషణ



*42 ఏళ్ల వయసులో ఏఎల్ఎస్ బారిన పడిన కేసీ హారెల్ క్రమంగా తన స్వరాన్ని కోల్పోయాడు. తన చిన్న కుమార్తెతో పాటలు పాడటం, కార్యాలయ సమావేశాల్లో మాట్లాడటం, సరదాగా జోకులు చెప్పడం వంటి సాధారణ జీవితానుభవాలు కూడా అతనికి దూరమయ్యాయి.*

అయితే మూడు సంవత్సరాల తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, డేవిస్‌కు చెందిన పరిశోధకులు అతని మెదడులో ప్రయోగాత్మక ఎలక్ట్రోడ్ పరికరాలను అమర్చారు. ఈ పరికరాలు మెదడులో ఉత్పత్తి అయ్యే సంకేతాలను సేకరించి, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వాటిని ముందుగా మాటలుగా, అనంతరం స్వరంగా మారుస్తాయి. అంతేకాక కంప్యూటర్ కర్సర్‌ను కదిలించడం, ఎంపికలు చేయడం వంటి పనులు కూడా అతను తన మెదడు సంకేతాల ద్వారానే నిర్వహించగలుగుతున్నాడు. పరిశోధకులు వెల్లడించిన వివరాల ప్రకారం, కేసీ తన ఇంటి నుంచే దాదాపు 3,800 గంటల పాటు ఈ వ్యవస్థను ఉపయోగించాడు.

- తరువాయి 2 వ పేజీలో...



# దద్దరిల్లిన ఢాకా

## బంగ్లాదేశ్‌లో కదంతొక్కిన హిందువులు

## జైశ్రీరామ్ నినాదాలతో నిరసన

*మైనారిటీల హక్కులను కాలరాస్తున్న బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్కడి హిందువులు కదం తొక్కారు. రాముడి విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ హిందూ సంఘాలు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో శుక్రవారం రాత్రి భారీ నిరసన చేపట్టారు.*

ఢాకా: ఈ కార్యక్రమంలో వేలాది మంది హిందువులు, విద్యార్థులు పాల్గొన్నారు. బంగ్లాదేశ్, గైబంధ జిల్లాలోని పలాష్ బరి కాంప్లెక్స్ దేవాలయ ప్రాంగణంలో 81 అడుగుల రాముడి విగ్రహాన్ని నిర్మిస్తున్నా రు. శ్రీశ్రీ రాధా గోవింద దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఈ విగ్రహం నిర్మాణం జరుగుతోంది. రాముడి విగ్రహంతోపాటు కృష్ణుడు, శివుడి విగ్రహాల్ని కూడా నిర్మిస్తున్నారు. ఇందులో రాముడి విగ్రహ నిర్మాణం అతిపెద్దది. ఈ నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తైంది. అయితే, రాముడి విగ్రహాన్ని నిర్మించవద్దని అక్కడి ముస్లిం సంఘాలు, మత గురువులు హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం ఈ విగ్రహ నిర్మాణాన్ని నిలిపివేసింది. అలాగే, రాముడి

- తరువాయి 2 వ పేజీలో...



## ఆలయం పైకప్పు కూలి

# ఆరుగురి మృతి

### మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

› 2

- పర్భణీలో ఘటన.. 40 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- ఘటనపై ప్రధాని మోదీ, సీఎం ఫడ్నవీస్ దిగ్భ్రాంతి

*మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. పర్భణీ జిల్లాలోని ప్రసిద్ధ యశ్వాడి మారుతి ఆలయంలో నిర్మాణంలో ఉన్న సభా మండపం పైకప్పు కూలిపోవడంతో ఆరుగురు భక్తులు మరణించారు. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.*

## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,889 |
| వెండి (కిలో): | రూ.2,95,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,970 |

# నేడే నీట్ రీ-ఎగ్జామ్

- ఎన్టీయే మాక్ డ్రిల్ సక్సెస్
- దేశవ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు
- తెలంగాణలో పరీక్షార్థులకు ఫ్రీ బస్



*జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో గతంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఆదివారం జరగనున్న నీట్ రీ-ఎగ్జామ్ కోసం శనివారం చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించింది.*

న్యూఢిల్లీ: ఈ మాక్ డ్రిల్‌లో భాగంగా, ఎస్కార్ట్ భద్రతతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను చేరవేయడం, పరీక్ష అనంతరం అదే భద్రత నడుమ సమాధాన పత్రాలను సేకరించడం వంటి ప్రక్రియలను ఎన్‌టీఏ అధికారులు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాలన్నింటినీ సీసీటీవీ నిఘా

- తరువాయి 2 వ పేజీలో...

## 16 డ్రగ్ కాంబినేషన్లపై

# నిషేధం



*వైద్యపరంగా సరైన ఆధారాలు లేవని, చికిత్సలో ప్రత్యేక ప్రయోజనం లేదని నిపుణుల కమిటీ నిర్ధారించిన 16 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల తయారీ, అమ్మకం, పంపిణీపై కేంద్రం నిషేధం విధించింది.*

న్యూఢిల్లీ: ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద, ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఈ మందుల తయారీ, అమ్మకం, పంపిణీని తక్షణమే నిషేధించింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ ఔషధ పదార్థాలను ఒకే మాత్ర లేదా సిరప్ రూపంలో కలిపి తయారు చేయడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్

- తరువాయి 2 వ పేజీలో...

## బండి భగీరథ్‌కు

# బెయిల్



*గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు శనివారం కీలక తీర్పును వెలువరించింది.*

మేడ్చల్, హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): బండి భగీరథ్ తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. అతనికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రత్యేక గమ్యం లేకుండా పార్కులో లేదా బహిరంగ ప్రదేశంలో నడిచేటప్పుడు మనుషులు ఎక్కువగా ఎడమవైపుకు (కౌంటర్‌క్లాక్‌వైజ్) తిరుగుతారని తాజా పరిశోధన వెల్లడించింది. స్పెయిన్, జపాన్‌లలో వివిధ వయసుల వారిపై నిర్వహించిన అధ్యయనాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపించింది. మొత్తం 209 మందిని ఒంటరిగా ఒక నిర్దిష్ట ప్రదేశంలో స్వేచ్ఛగా నడవమని చెప్పినప్పటికీ, వారిలో చాలామంది ఎడమవైపు తిరిగే అలవాటు చూపించారు. ఈ ధోరణి లింగం, కుడి చేతి - ఎడమచేతి ఆధిక్యం లేదా కాళ్ల వినియోగంతో సంబంధం లేకుండా కనిపించింది. అయితే యువతలో ఈ ఎడమవైపు మళ్లే ప్రవృత్తి కొంత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితి కంటి ప్రభావమో, భూమి అయస్కాంత క్షేత్రమో, కోరియోలిస్ ప్రభావమో కాదని పరిశోధకులు చెప్తున్నారు.



# హార్ముజ్ మళ్లీ క్లోజ్!

## మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల వల్లే

టెహ్రాన్: అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందానికి మళ్లీ విఘాతం కలిగింది. చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని తెరిచిన 24 గంటల్లోనే మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు నిరసనగానే ఈ చర్యకు దిగినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ తీరును టెహ్రాన్ తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతోనే హార్ముజ్ మూసివేత నిర్ణయంపై తీసుకున్నట్లు ఇరాన్ ఉన్నతస్థాయి సంయుక్త సైనిక కమాండ్ ఖతమ్ అల్ అన్బియా కేంద్ర కార్యాలయం వెల్లడించింది. అంతేకాదు, తమ ప్రతిస్పందనలో ఇది కేవలం మొదటి అడుగు మాత్రమేనని, వాటి తీరు ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు తప్పవని

- తరువాయి 2 వ పేజీలో...

# పీఎం కిసాన్ నిధులు విడుదల




ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు.

› 2




## దుబాయ్‌లో 5 రోజులు

# పాస్‌పోర్ట్, వీసా సేవలు బంద్

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న భారత పౌరులకు భారత రాయబార కార్యాలయం కీలక ప్రకటన విడుదల చేసింది. పాస్‌పోర్ట్, వీసా, అటెస్టేషన్ వంటి సాధారణ కాన్సులర్ సేవలు ఐదు రోజుల పాటు నిలిచిపోనున్నాయి. జూన్ 26 నుంచి 30వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉండవని అబుదాబి లోని భారత రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఈ సేవల నిర్వహణ బాధ్యతలను కొత్త సంస్థకు అప్పగిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చేపట్టినట్లు ఎంబసీ వివరించింది. ప్రస్తుతం పాస్‌పోర్ట్, వీసా సేవలు అందిస్తున్న బీఎల్ఎస్ ఇంటర్నేషనల్, అటెస్టేషన్ సేవలను పర్యవేక్షిస్తున్న ఎస్‌జీఐవీఎస్ గ్లోబల్ సంస్థలు జూన్ 25వ తేదీతో తమ కార్యకలాపాలను ముగించనున్నాయి. జూలై 1వ తేదీ నుంచి, కొత్తగా నియమించిన అల్ హింద్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎల్ఎల్‌సీ ఈ

- తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

21-6-2026

మేషం: వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆప్తుల నుండి అవసరానికి సహాయ సహకారాలు అందుతాయి. దీర్ఘకాలిక ఋణాలు నుండి విముక్తి లభిస్తుంది. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. వ్యాపార పరంగా నూతన పెట్టుబడులు లభిస్తాయి. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: దాయాదులతో ఆస్థి వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ఆశించిన సహకారం అందుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆత్మ విశ్వాసంతో పని చేసి లాభాలు అందుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నిరుద్యోగులకు లభించిన అవకాశలు సద్వినియోగం చేసుకోవాలి.

మిథునం: సంతాన విషయమై ఊహించని విషయాలు తెలుస్తాయి. ఋణ ఒత్తిడి అధికమై మానసిక శిరో భాధలు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. స్థిరాస్తి ఒప్పందాలు కష్టం మీద పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: ఇంటా బయట ఒత్తిడి వలన శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. మిత్రులకు మీ అభిప్రాయాలు నచ్చే విధంగా ఉండవు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. కుటుంబ పెద్దలతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగాల్లో అధికారుల ఆగ్రహానికి గురికావాల్సివస్తుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. ఆర్థిక ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహరించి ఆకట్టుకుంటారు. వాహన అనుకూలత కలుగుతుంది. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానలు అందుతాయి. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

తుల: చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. శారీరక మానసిక సమస్యలు భాదిస్తాయి. ఉద్యోగమున విలువైన పత్రముల విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. కుటుంబ విషయంలో ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. దైవ కార్యక్రమంలో పాల్గొనడం మంచిది.

వృశ్చికం: బంధు మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

ధనస్సు: నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. అన్ని వైపుల నుండి ఆదాయ మార్గాలు పెరుగుతాయి. కీలక వ్యవహారాలలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మకరం: ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉంటుంది. ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. సమయానికి నిద్రహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆప్తులతో మాట పట్టింపులు కలుగుతాయి.

కుంభం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. విందు వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి.

మీనం: ఊహించని రీతిలో ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయటా జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో మార్గ అవరోధాలు తప్పవు. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఇంటా బయట వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

# నేడే నీట్ రీ-ఎగ్జామ్



(మొదటి పేజీ తరువాయి)

నీడలోకి తెచ్చారు. పరీక్ష రోజున ఎలాంటి అక్రమాలకు తావులేకుండా బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5:15 గంటలకు ముగుస్తుంది. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను తప్పనిసరిగా తీసుకురావాలి. తేలికైన దుస్తులు (హాఫ్-స్లీవ్ షర్టులు/టీ-షర్టులు, ప్యాంట్లు), స్లిప్పర్లు లేదా తక్కువ హీల్స్ ఉన్న పాదరక్షలు ధరించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, పెద్ద బెల్ట్ బకిల్స్, బరువైన ఆభరణాలు వంటివి కేంద్రాల్లోకి అనుమతించరు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, రద్దు చేసిన పరీక్షను జాతీయ పరీక్షల సంస్థ తిరిగి నిర్వహించనుంది. ఈ పరీక్షకు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో ఈ పరీక్ష జరగనుంది. దేశవ్యాప్తంగా 551 నగరాల్లో 5,440 కేంద్రాలతో పాటు, విదేశాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. దేశవ్యాప్తంగా 1.38 లక్షల ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, 51,000 సిగ్నల్ జామర్లు, రెట్టింపు బయోమెట్రిక్ తనిఖీలను ఏర్పాటు చేశారు.

**విద్యార్థి నాగ్‌పూర్‌లో..**
**నీట్ పరీక్ష కేంద్రం యూఏఈలో**

నీట్ రీటెస్టుకు సంబంధించి తనకు యూఏఈలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారని నాగ్‌పూర్‌కు (మహారాష్ట్ర) చెందిన ఒక విద్యార్థి తెలిపాడు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు విద్యార్థి తండ్రి చెప్పారు. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కాగా, ఈ ఘటనపై ఎన్టీయే ప్రకటన విడుదల చేసింది. సదరు విద్యార్థి రెండు సార్లు అబుదాబీ ఆప్షన్ ఎంచుకున్నారని, ఫైనల్ సబ్మిట్‌కు ముందు కూడా అలాగే చేశాడని, కానీ.. తాము సమస్యను పరిష్కరించి నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం ఎంపిక చేసినట్లు పేర్కొంది.

# బండి భగీరథ్‌కు బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. దీంతో నెల రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భరీరథ్ జైలు నుంచి విడుదల కానున్నారు. ఈ కేసు వివరాల్లోకి వెళితే.. మే 2026 మొదటి వారంలో హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై ఒక కేసు నమోదైంది. ఒక 17 ఏళ్ల మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. గత ఆరు నెలలుగా భగీరథ్ తమ కుమార్తెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మానసికంగా వేధించాడని ఆ తల్లి ఆరోపించింది. మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో బాలికకు బలవంతంగా మద్యం తాగించి, అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు భగీరథ్‌పై పోక్సో చట్టం సెక్షన్ 11 కింద కేసు నమోదు చేశారు. అయితే, ఈ పోక్సో కేసు నమోదు కావడానికి కొన్ని గంటల ముందే.. బండి భగీరథ్ కూడా కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సదరు బాలిక కుటుంబంపై రిటర్న్ ఫిర్యాదు చేశారు. సదరు బాలిక, ఆమె తల్లిదండ్రులు తప్పుడు కేసు పెడతామని బెదిరిస్తూ తన నుండి రూ.5 కోట్లు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము మొదట్లో స్నేహపూర్వకంగానే ఉన్నామని, అయితే ఆ తర్వాత వారు తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారని, తిరస్కరించేసరికి డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టారన్నారు. ఈ మేరకు ఆ బాలిక కుటుంబంపై కూడా ఎక్స్‌టార్షన్ కింద కేసు నమోదైంది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అరెస్టు నుంచి తప్పించుకోవడానికి భగీరథ్ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, కేసు తీవ్రతను పరిశీలించిన హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో పోలీసులు భగీరథ్ కోసం గాలింపు ముమ్మరం చేశారు. లుకౌట్ నోటీసులు జారీ చేసి, హైదరాబాద్, కరీంనగర్ పరిసరాల్లో ఐదు ప్రత్యేక బృందాలతో వెతికారు. అనంతరం మే 16 పోలీసులు బండి భగీరథ్‌ను నార్సింగి సమీపంలోని టీజీపీఏ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలోనే భగీరథ్ లాయర్లు జిల్లా కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య హోరాహోరీగా వాదనలు జరిగాయి. బండి భగీరథ్ తరఫున వాదించిన సీనియర్ కౌన్సిల్.. ఈ కేసులో భగీరథ్‌కు ఎలాంటి ప్రత్యక్ష ప్రమేయం లేదని, కేవలం రాజకీయ ప్రాధాన్యత ఉన్న కుటుంబం కావడంతోనే కావాలని కొందరు ఈ కేసులోకి లాగారని న్యాయస్థానానికి వివరించారు. దర్యాప్తునకు భగీరథ్ పూర్తిస్థాయిలో సహకరిస్తారని, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం లేదని కాబట్టి ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరువర్గాల వాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి.. కేసు తీవ్రతను, నిందితుడి పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకుని చివరికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.



# హర్మూజ్ మళ్లీ క్లోజ్!

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించింది. ఈ చర్య అమెరికా-ఇరాన్ ఒప్పందానికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఆ ఒప్పందం ప్రకారం అమెరికాతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం కింద 60 రోజుల చర్చల కాలంలో జలసంధిని ద్వారా రవాణా సాగించే నౌకలపై టోల్ ఫీజు మాఫీ చేయడానికి టెహ్రాన్ అంగీకరించింది. హర్మూజ్ జలసంధిని సమీపించవద్దని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళం నౌకలను హెచ్చరించింది. అలా చేస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ శాంతి ఒప్పందంలో లెబనాన్‌పై దాడులు ఆపేయాలనేది ఒక నిబంధన. కానీ, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతనాహ్యు మాత్రం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినా వినిపించుకోవడం లేదు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ తాజా దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మూసివేతకు ముందు, మధ్యంతర ఒప్పందం అమల్లో ఉన్నప్పుడు జలసంధి గుండా ప్రయాణించాలనుకునే నౌకలు.. గమ్యస్థానానికి చేరడానికి కనీసం 48 గంటల ముందు ట్రాన్సిట్ రిక్వెస్ట్ సమర్పించాల్సి ఉండేది. ఇదిలా ఉండగా, కాల్పుల విరమణ కొనసాగుతుందని తాము విశ్వాసంతో ఉన్నానని, ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేస్తోందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు.

**హర్మూజ్ దాటిన 3 భారత నౌకలు**

దాదాపు 8.60 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు, 94 మంది భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న మూడు భారతీయ చమురు ట్యాంకర్లు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ శనివారం ప్రకటించారు. ఇరాన్-అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్' అనే మూడు భారతీయ నౌకలు ఈ జలసంధిని దాటి భారతదేశానికి బయలుదేరాయని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ మూడు నౌకలు ప్రయాణాన్ని పూర్తి చేయడానికి ముందు.. భారత జెండాతో ఉన్న మరో 13 కార్గో నౌకలు హోర్ముజ్ జలసంధిలోనే చిక్కుకుపోయాయని, భారతీయ నావికుల భద్రతతో పాటు దేశ ఇంధన అవసరాలను కాపాడటానికి తమ మంత్రిత్వ శాఖ అన్ని ఏజెన్సీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.

# దుబాయ్‌లో 5 రోజులు పాస్‌పోర్ట్, వీసా సేవలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

సేవలను అందించనుంది. యూఏఈలోని ఏడు ఎమిరేట్స్‌లో మొత్తం 16 కేంద్రాల ద్వారా ఈ సంస్థ తన కార్యకలాపాలను సాగించనుంది. సేవల మార్పిడి ప్రక్రియ కొనసాగే సమయంలో అత్యవసర కాన్సులర్ సేవల కోసం ప్రజలు నేరుగా అబుదాబిలోని భారత రాయబార కార్యాలయాన్ని లేదా దుబాయ్‌లోని కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. యూఏఈలో 35 లక్షల మందికి పైగా భారతీయులు నివసిస్తున్న దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసర దరఖాస్తులను జూన్ 25వ తేదీలోపు సమర్పించాలని అధికారులు సూచించారు.

# ఆలయం పైకప్పు కూలి ఆరుగురి మృతి

(మొదటి పేజీ తరువాయి)

పర్భణీ: మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. పర్భణీ జిల్లాలోని ప్రసిద్ధ యశ్వాడి మారుతి ఆలయంలో నిర్మాణంలో ఉన్న సభా మండపం పైకప్పు కూలిపోవడంతో ఆరుగురు భక్తులు మరణించారు. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకున్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, శనివారం సాయంత్రం 3:30 గంటల సమయంలో ఆలయంలో కీర్తన కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అదే సమయంలో రాజస్థానీ పింక్ స్టోన్స్, కాంక్రీట్ స్లాబులతో నిర్మిస్తున్న సభా మండపం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో భక్తులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, జిల్లా యంత్రాంగం సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్రేన్లు, ఇతర భారీ యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాద స్థలానికి ప్రజలు గుంపులుగా రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. నిర్మాణంలో నాణ్యతా లోపాల వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ జరిపే అవకాశం ఉంది.



# 16 డ్రగ్ కాంబినేషన్లపై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

అంటారు. అయితే కొన్ని కాంబినేషన్లు రోగులకు అదనపు ప్రయోజనం కలిగించకపోగా, ఆరోగ్య సమస్యలు సృష్టించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. కమిటీ సిఫార్సుల ఆధారంగా, 16 కాంబినేషన్లు అహేతుకమైనవని, వాటిని కొనసాగించడం ప్రయోజనకరం కాదని ప్రభుత్వం నిర్ధారించింది. నిషేధిత జాబితాలో యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ, కడుపు తిమ్మిర్లకు ఉపయోగించే మందులు, కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. అమోక్సిసిలిన్ ప్లస్ సెరాటియోపెప్టిడేస్, అమోక్సిసిలిన్ ప్లస్ సెరాటియోపెప్టిడేస్ ప్లస్ లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్, సెఫ్యూరాక్సిమ్ ప్లస్ సెరాటియోపెప్టిడేస్, సెఫాడ్రాక్సిల్ ప్లస్ ప్రోబెనెసిడ్, డైసైక్లోమైన్ ప్లస్ పారాసెటమాల్ ప్లస్ క్లిడినియం బ్రోమైడ్ ప్లస్ క్లోర్డియాజెపాక్సైడ్‌తో పాటు అనేక కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. సురక్షితమైన, ప్రభావవంతమైన, శాస్త్రీయంగా ధ్రువీకరించిన మందులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటమే తమ లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

# చిప్పు మాట్లాడింది!

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమయంలో 1,83,060 వాక్యాలు, మొత్తం 19,60,163 పదాలను నిమిషానికి సగటున 56 పదాల వేగంతో వ్యక్తీకరించాడు. ఈ ఫలితాలు తాజాగా 'నేచర్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇంతకు ముందు పక్షవాతం లేదా ఏఎల్ఎస్ బాధితులు ఉపయోగించే కమ్యూనికేషన్ పరికరాలు చాలా నెమ్మదిగా పనిచేసేవి. అవసరమైన సమాచారాన్ని మాత్రమే తెలియజేయగలిగేవి. కానీ తాజా సాంకేతికతతో కేసీ కథలు చెప్పడం, జోకులు వేయడం, సరదా శబ్ద ప్రభావా లను వినిపించడం, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సహజంగా సంభాషించడం సాధ్యమవుతోంది. 'ఇతర పరికరాలతో నేను సంభాషణలో భాగం మాత్రమే. ఇప్పుడు నేనే సంభాషణను ముందుకు నడిపిస్తున్నా ను.మాట్లాడే సామర్థ్యాన్ని తిరిగి పొందడం నా జీవితంలో అపారమైన ఆనందాన్ని తీసుకొచ్చింది. నాతోలాంటి వైద్య అవసరాలు ఉన్నవారు మళ్లీ సమాజంతో, కుటుంబంతో సహజంగా మమేకం కావడానికి ఈ సాంకేతికత దోహదపడుతుంది.' అని ఆయన పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ వ్యవస్థ వైర్ల ద్వారా కంప్యూటర్‌కు అనుసంధానమై ఉంటోంది. ఆయన భార్య లెవానా సాక్సన్ ప్రతిసారి పరికరాన్ని కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తోంది. తద్వారా అతను వీడియో కాల్స్ చేయడం, వృత్తిపరమైన సమావేశాల్లో పాల్గొనడం, వాతావరణ మార్పు, వికలాంగుల హక్కుల కార్యకర్తగా తన పనిని కొనసాగిస్తున్నారు. బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌లు కేవలం ప్రయోగశాలలకే పరిమితమైన సాంకేతికత కాదని, రోజువారీ జీవితంలో ఉపయోగపడే స్థాయికి చేరుకుంటున్నాయని ఈ అధ్యయనం నిరూపించిందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో పూర్తిగా వైర్‌లెస్ వ్యవస్థలు, మెదడు సంకేతాలను నేరుగా స్వరంగా మార్చే సాంకేతికత అందుబాటులోకి వస్తే సంభాషణ మరింత సహజంగా మారే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కేసీ హారెల్.. సగటున నిమిషానికి 56 పదాల వేగంతో సంభాషిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వ్యవస్థ వైర్లతో పనిచేస్తున్నప్పటికీ, భవిష్యత్తులో పూర్తిగా వైర్‌లెస్ రూపంలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# దద్దరిల్లిన ఢాకా

(మొదటి పేజీ తరువాయి)

విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఇటీవల కొన్ని ముస్లిం సంఘాలు నిరసన చేపట్టాయి. దీనిలో భాగంగా రాముడి చిత్ర పటాన్ని అవమానపరిచాయి. విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడాన్ని, రాముడి చిత్ర పటాన్ని అవమానించడాన్ని నిరసిస్తూ ఢాకాలో హిందువులు శుక్రవారం రాత్రిపూట కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలు చేశారు. ఢాకాలోని షాబాగ్ ఇంటర్‌సెక్షన్ నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీ చేశారు. అనేక హిందూ సంఘాలు, విద్యార్థి సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. ఢాకాలోని రిపోర్టర్స్ యునిటీ బిల్డింగ్ వద్ద కూడా మరికొందరు నిరసన చేపట్టారు. విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, రాముడిని అవమానించి వారిపై ఫిర్యాదు చేసినప్పటికీ.. పోలీసులు ఇప్పటివరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుల్ని మూడు రోజుల్లోగా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశవ్యాప్తంగా మరిన్ని ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే, విగ్రహ ఏర్పాటు పూర్తి చేయకపోతే దేశంలోని అన్ని జిల్లాల్లో రాముడి ఆలయాలు కడతామని కూడా హెచ్చరించారు. అయితే, ఈ నిరసనల్ని కొన్నిచోట్ల పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత గందరగోళం తలెత్తింది. మరోవైపు కొత్తగా ఏర్పడ్డ తారిక్ రెహమాన్ నాయకత్వంలోని ప్రభుత్వంలో బంగ్లాదేశ్‌లో మైనారిటీలకు రక్షణ లేకుండా పోతోందని హిందూ సంఘాలు సహా పలు మైనారిటీ సంఘాలు విమర్శిస్తున్నాయి. ముస్లిం మెజారిటీ దేశం కావడంతో ఇతర మతస్తులపై తరచూ దాడులు జరుగుతున్నాయి.

# పీఎం కిసాన్ నిధులు విడుదల

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు pmkisan.gov.in వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

# వెల్‌నెస్ కేర్ కావాలి: భట్టి

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం హోటల్ పార్క్ హయత్ లో జరిగిన ఇండియా హెల్త్ సమ్మిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు.





మన్మోహన్ సింగ్ నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. వై.ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికెట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే ఇల్‌నెస్ కేర్ గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే వెల్‌నెస్ కేర్ గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణే అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్, పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికి ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్, ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే దేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

## కొత్త ఓటరు నమోదుపై
# అబద్ధాలు నమ్మొద్దు

**తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి**

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

# యోగా ఒక మతానికి పరిమితం కాదు: వెంకయ్య నాయుడు

సికింద్రాబాద్, జూన్ 20 (ఈవార్తలు): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. "ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు.

# వారసత్వ ఉద్యోగాలివ్వకపోతే నిరాహార దీక్ష చేస్తా

**కాంగ్రెస్ ప్రభుత్వానికి కల్వకుంట్ల కవిత వార్నింగ్**

భూపాలపల్లి, జూన్ 20 (ఈవార్తలు): సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు.



# లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

**మాపై దుష్ప్రచారం ఆపండి.. 600 ఆపరేషన్స్ పూర్తి చేశాం.. హైడ్రా కమిషనర్ రంగనాథ్**

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక



తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

# ఆలయ పరిపాలనకు ఆధునిక బాట

**సిటా ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ**

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): దేవాలయ పరిపాలనలో నైపుణ్యాభివృద్ధి, ఆధునిక నిర్వహణ విధానాల అమలుకు ఉద్దేశించిన స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్ఐటీఏ) శిక్షణలో తెలంగాణ దేవాదాయ శాఖ దేశంలోనే ఉన్నత స్థానంలో నిలుస్తుందన్న నమ్మకముందని మంత్రి కొండా సురేఖ అన్నారు. అర్చకులు, ఉద్యోగులు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. దైవాజ్ఞ లేనిదే ఏ కార్యం జరగదనీ, దేవాదాయ శాఖ మంత్రిగా తన చేతులు మీదుగా ఈ కార్యాలు జరగాల్సి ఉండటం దైవేచ్ఛ అని తెలిపారు. హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో గల దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయం (ధార్మిక భవన్) లో మంత్రి కొండా సురేఖ శనివారం రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ (సిటా)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఉద్యోగుల సంక్షేమం, పాలనా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధికి సిటా ఆధ్వర్యంలో కొత్త దిశను నిర్దేశించనున్నామని అన్నారు. దేవాదాయ శాఖను సరికొత్తగా ఆవిష్కరించే దిశలో సిటా కార్యాచరణ ఉండోబోతున్నదని మంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత 12 ఏళ్ళకు సిటాను పునః ప్రారంభించుకోవడం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. ఆలయాల పరిపాలన, సిబ్బంది శిక్షణ, కొత్త సాంకేతికత అమలు దిశగా అవసరమైన విధానాలను, శిక్షణా కార్యక్రమాలను సిటా చేపడుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అర్చకులు, ఉద్యోగుల నిర్వహణలో దేవాలయాల నిర్వహణ, దేవాలయ భూముల సంరక్షణ, దేవాలయ ఆదాయ నిర్వహణ తదితర అంశాల్లో కొత్త ఒరవడి ప్రారంభవుతుందన్న ఆశాభావాన్ని మంత్రి సురేఖ వ్యక్తం చేశారు. దేవుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని, దేవాదాయ శాఖ మంత్రిగా తన ఆధ్వర్యంలో దేవాలయాల వికాసం, ఉద్యోగుల సంక్షేమానికి చేపడుతున్న చర్యల పట్ల మంత్రి సురేఖ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కింది స్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగుల వరకు, దేవాలయ సిబ్బంది మొత్తం ఈ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందితే వచ్చే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. అర్చకులు, ఉద్యోగులు నిష్టతో పనిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఆధ్యాత్మిక రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ధార్మిక సలహాదారు ఆర్. గోవింద హరి, సిటా డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, అడిషనల్ కమిషనర్లు శ్రీనివాస్, జ్యోతి, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ లు వినోద్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఢిల్లీ వస్తున్నా.. మెట్రోపై చర్చిద్దాం పద

**కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ**

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పెండింగ్ అంశాల పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఐఆర్ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# మల్టీప్లెక్స్‌ల్లో ఫుడ్ సేఫ్టీ దాడులు

**హైదరాబాద్‌లోని పలుచోట్ల విస్తృత తనిఖీలు**

**సినిమా హాళ్లలో పరిస్థితి మెరుగ్గా ఉందని వెల్లడి**

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని పలు రెస్టారెంట్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో తీవ్రమైన ఉల్లంఘనలు వెలుగుచూడగా, అందుకు భిన్నంగా ప్రముఖ మల్టీప్లెక్స్‌లలోని ఫుడ్ కోర్టులు ఆహార భద్రతా ప్రమాణాలను మెరుగ్గా పాటిస్తున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. శుక్రవారం నగరంలోని ప్రధాన మాల్స్‌లో ఉన్న సినిమా థియేటర్ల ఆహార విభాగాలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇన్‌ఆర్బిట్ మాల్‌లోని పీవీఆర్ ఐనాక్స్, లులూ మాల్‌లోని సినీపోలిస్, జీఎస్ఎం మాల్‌లోని ఐనాక్స్ ఫుడ్ అవుట్‌లెట్లలో అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కొన్ని స్వల్ప లోపాలను గుర్తించినప్పటికీ, సాధారణ రెస్టారెంట్లలో కనిపించినట్లుగా పురుగులు ఉనికి లేదా తీవ్రమైన అపరిశుభ్రత వంటి పరిస్థితులు లేవని అధికారులు స్పష్టం చేశారు. ఇన్‌ఆర్బిట్ మాల్‌లోని పీవీఆర్ ఐనాక్స్‌లో గడువు ముగిసిన సేవ్‌తో పాటు పాడైపోయిన కాలీఫ్లవర్‌ను గుర్తించిన అధికారులు వాటిని వెంటనే ధ్వంసం చేయించారు. వండిన చికెన్ టిక్కాను ఫ్రీజర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేయడం, కొన్ని ఆహార పదార్థాలపై లేబుల్స్ లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. అయినప్పటికీ, సిబ్బంది హెయిర్‌నెట్‌లు, ఆప్రన్లు ధరించడం వంటి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. లులూ మాల్‌లోని సినీపోలిస్‌లో డస్ట్‌బిన్‌లకు మూతలు లేకపోవడం, ఫ్రీజర్‌లో ఉడికించిన పాస్తాను నిల్వ ఉంచడం వంటి చిన్నపాటి లోపాలు మినహా మిగిలిన ప్రమాణాలు బాగున్నాయని అధికారులు తెలిపారు. జీఎస్ఎం మాల్‌లోని ఐనాక్స్‌లో బర్గర్ బన్స్, చికెన్ టిక్కాకు సరైన లేబులింగ్ లేకపోవడం, నీటి నాణ్యత పరీక్షా నివేదికలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో యాజమాన్యానికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల గచ్చిబౌలి, మదీనగూడ, కొండాపూర్ ప్రాంతాల్లోని రెస్టారెంట్లపై జరిగిన ఆయా రెస్టారెంట్లతో పోలిస్తే మల్టీప్లెక్స్‌లలోని ఫుడ్ కోర్టులు మెరుగైన ప్రమాణాలను పాటిస్తుండటం సిని ప్రేక్షకులకు కొంత ఊరటనిచ్చే పరిణామం.

# ఎలక్ట్రిక్ బస్సులపై అ'భయం'

**ఉద్యోగ సంఘాలతో ఆర్టీసీ అధికారుల చర్చలు**

హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): త్వరలో టీజీఎస్ఆర్టీసీకి 2వేల ఎలక్ట్రిక్ బస్సులు రానున్న నేపథ్యంలో ఆర్టీసీ కార్మిక సంఘాలతో అధికారులు శనివారం చర్చలు జరిపారు. ఈవీల రాకతో తమ ఉద్యోగాలు పోతాయని కార్మికులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆర్టీసీ ఈడీలు వెంకన్న, రాజశేఖర్, శ్రీధర్, ఖుర్షోషా ఖాన్, సాలమన్ కార్మిక సంఘాలతో చర్చలు జరిపారు. 2వేల ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని... వీటి కోసం అవసరమైన 20 కొత్త డిపోలు కూడా ఏర్పాటు కానున్నాయని వారు సంఘాలతో తెలిపారు. వీటి వల్ల కొత్త నియామకాలు కూడా ఉంటాయని... ఈవీల వల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు భరోసా ఇచ్చారు. 2 వేల బస్సుల్లో వెయ్యి ఆర్టీసీ, మరో వెయ్యి ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా నిర్వహిస్తారని అధికారులు తెలిపినట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. వీటి కోసం 20 కొత్త బస్ డిపోలు వస్తాయని.. పది ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల, పదింటిని ఔటర్ లోపల ఏర్పాటు చేస్తారని అన్నారు. మరోవైపు వెయ్యి మంది డ్రైవర్లకు త్వరలో నియామక పత్రాలు అందచేస్తారని.. త్వరలో 1500 మంది కండక్టర్ల నియామకాలు చేస్తారని అధికారులు తెలిపినట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు.

# మోనాలిసా దంపతులకు రక్షణ కల్పించండి

**కేరళ హైకోర్టు ఆదేశాలు**

తిరువనంతపురం: సోషల్ మీడియా పుణ్యమా అని దేశవ్యాప్తంగా విపరీతమైన గుర్తింపు తెచ్చుకున్న 'కుంభమేళా గర్ల్' మోనాలిసా మతాంతర వివాహ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ ప్రాణాలకు ముప్పు ఉందంటూ మోనాలిసా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కేరళ హైకోర్టు... ఆమెకు, ఆమె భర్త మొహమ్మద్ ఫర్మాన్‌కు తక్షణమే పోలీసు భద్రత కల్పించాలని ఈరోజు కీలకమైన తీర్పునిచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన మోనాలిసా, మొహమ్మద్ ఫర్మాన్‌కు సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో ఈ ఏడాది మార్చి 11వ తేదీన తిరువనంతపురంలోని ప్రసిద్ధ అరుమనూర్ టెంపుల్‌లో హిందూ సాంప్రదాయాల ప్రకారం ఈ జంట వివాహం చేసుకున్నారు. అయితే మతాంతర వివాహం కావడం, పైగా మోనాలిసా వయసుపై అనుమానాలు రావడంతో ఇక్కడే అసలు కథ మొదలైంది. మోనాలిసా తండ్రి తన కూతురిని ఫర్మాన్ కిడ్నాప్ చేశాడంటూ మధ్యప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ లోగా ఈ వ్యవహారం 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' వద్దకు చేరింది. ఎస్టీ కమిషన్ జరిపిన లోతైన దర్యాప్తులో మోనాలిసా ఇంకా మైనర్ అని, ఆమెకు పెళ్లి వయసు రాలేదని తేలింది. దీంతో మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్‌పై పోక్సోతో పాటు పలు కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్‌కు రంగం సిద్ధం చేశారు. అయితే, అరెస్ట్ భయంతో ఫర్మాన్ కేరళ హైకోర్టును ఆశ్రయించగా... కోర్టు అతని అరెస్ట్‌పై స్టే విధించింది. ప్రస్తుతం ఈ జంట కేరళలోనే తలదాచుకుంటున్నారు. అయితే తాము మతాంతర వివాహం చేసుకోవడం వల్ల మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తుల నుంచి తమ ప్రాణాలకు తీవ్ర ముప్పు పొంచి ఉందంటూ మోనాలిసా కేరళ హైకోర్టులో ప్రొటెక్షన్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ పై విచరణ జరిపిన హైకోర్టు... ఆమెకు, ఆమె భర్తకు భద్రత కల్పించాలని తాజాగా పోలీసులను ఆదేశించింది.

# 10 లక్షల కోట్లకు తమిళనాడు అప్పు

**విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన**



చెన్నై: తమిళనాడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'వుయ్ ది లీడర్' వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక 'పోస్ట్‌మార్టమ్' లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# మల్యాలలో డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మల్యాల, జూన్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని అంగడిబజార్ పరిసర ప్రాంతాల్లో శనివారం జగిత్యాల పోలీసు అధికారుల ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందంతో కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా నివారించడంతో పాటు, నిషేధిత వస్తువుల విక్రయాలను అరికట్టే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. దుకాణాలను పరిశీలించిన అధికారులు అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మత్తు పదార్థాల విక్రయం, నిల్వ లేదా రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం: పోలీసులు



మల్యాల, జూన్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మల్యాలను గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. మండలంలో ఎక్కడైనా గంజాయి సాగు, నిల్వలు లేదా విక్రయాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోలీసులతో కలిసి పనిచేయాలని ఎస్ఐ సందీప్ పిలుపునిచ్చారు.

# అంజన్న సేవలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, జూన్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ జి. రాజగౌడ్ కుటుంబ సమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి ఆశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. సుపరింటెండెంట్ సునీల్ శాలువ కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.



# 'అయోధ్య' విరాళాలపై సిట్

**ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా.. నిజానిజాలు తేలుస్తామన్న యూపీ సీఎం యోగి**

అయోధ్య: అయోధ్య రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా కీలక ప్రతిపాదన చేశారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో అయోధ్యలో కూడా వృత్తిపరమైన పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. విరాళాలు, హుండీ కానుకల లెక్కింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తనను తీవ్రంగా బాధించాయని, ఇవి భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని నృపేంద్ర మిశ్రా అన్నారు. ఈ నేపథ్యంలో, ఆలయ ట్రస్టు విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడిన నృపేంద్ర మిశ్రా, ఆలయ నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పనిచేసిన అనుభవం ఉన్న ఒక స్వతంత్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)ను నియమించాలని, ఉన్నతస్థాయిలో సిబ్బంది నియామకాలను క్రమబద్ధీకరించాలని సూచించారు. టీటీడీలో కమిషనర్ స్థాయి అధికారి సుదీర్ఘకాలం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించే విధానాన్ని ఆయన ఉదహరించారు. టీటీడీ చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కాకుండా, దాని పాలనా సూత్రాలను అనుసరించడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చని వివరించారు. ప్రస్తుతం సిట్ అధికారులు ఆలయ ఆర్థిక రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయం చేస్తున్నాయని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. సిట్ దర్యాప్తులో నిజానిజాలు బయటపడతాయని, భక్తులు ఆందోళన చెందవద్దని కోరారు. కోట్లాది మంది భక్తుల నమ్మకంతో ముడిపడి ఉన్న ఆలయ పవిత్రతను కాపాడేందుకు నిపుణులతో కూడిన నిర్వహణ ఎంతో అవసరమని నృపేంద్ర మిశ్రా అభిప్రాయపడ్డారు.

# హైకోర్టులో లాయర్లకు కుర్చీలు ఉంటలేవట!

**కర్ణాటక హైకోర్టులో న్యాయవాదుల ఇబ్బందులు**

**లాయర్ల కుర్చీలను ఆక్రమిస్తున్న ఇంటర్న్‌లు**


**ప్రాక్టికల్ పరిష్కారాలు సూచించాలన్న న్యాయమూర్తి**



బెంగళూరు: కర్ణాటక హైకోర్టులోని కోర్టు గదులు తీవ్ర రద్దీతో కిక్కిరిసిపోతున్నాయని, ముఖ్యంగా న్యాయవాదుల కోసం ఉద్దేశించిన కుర్చీలను కొత్తగా వచ్చిన న్యాయ విద్య ఇంటర్న్‌లు ఆక్రమించుకుంటున్నారని ఆందోళన వ్యక్తమైంది. ఈ సమస్యపై స్పందించిన ఓ సిట్టింగ్ జడ్జి, రద్దీని నియంత్రించడానికి ఆచరణాత్మక పరిష్కారాలు సూచించాలని న్యాయవాదులను కోరారు. శుక్రవారం కోర్టు హాల్ నంబర్ 14లో జస్టిస్ ఎం. నాగప్రసన్న విచారణ జరుపుతుండగా, సీనియర్ న్యాయవాది కేఎన్ ఫణీంద్ర ఈ అంశాన్ని ప్రస్తావించారు. కోర్టు గదుల్లో కనీసం నిలబడటానికి కూడా చోటు ఉండటం లేదని, ముఖ్యంగా మధ్యాహ్నం తర్వాత పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోందని తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ నాగప్రసన్న, "దీనికి మీరంతా ఓ పరిష్కారం చెప్పండి, నేను అమలు చేస్తాను" అని అన్నారు. ఇంటర్న్‌లు కుర్చీలు ఖాళీ చేయడం లేదని ఫణీంద్ర చెప్పగా, "ఇంటర్న్‌ల విషయంలో ఏం చేయాలి? వాళ్లను రావద్దని చెప్పండి. వాళ్లు కుర్చీల్లో కూర్చోవడానికి వీల్లేదు" అని జస్టిస్ వ్యాఖ్యానించారు. కోర్టులో రద్దీకి గల కారణాలపైనా ఈ సందర్భంగా చర్చ జరిగింది. రోజువారీగా కొత్త కేసులను, మల్టిపుల్ కాజ్‌లిస్ట్‌లను విచారణకు లిస్ట్ చేయడం వల్ల న్యాయవాదులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులోనే ఉండాల్సి వస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఉదయం, మధ్యాహ్నం విచారణకు వచ్చే కేసులను వేర్వేరుగా లిస్టింగ్‌లో చూపిస్తే రద్దీ తగ్గొచ్చని అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్ సూచించారు. గతంలో నిర్దిష్ట రోజుల్లో మాత్రమే కొత్త కేసులను విచారణకు తీసుకునేవారని, న్యాయవాదుల కోరిక మేరకే రోజువారీ విచారణకు మార్పు చేశామని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఏదేమైనా, ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, గతంలోనూ ఇలాంటి ఫిర్యాదుల నేపథ్యంలో ఇంటర్న్‌ల ప్రవేశాన్ని నియంత్రించేందుకు హైకోర్టు ప్రత్యేక పాసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# అమెరికా ఎల్పీజీ వైపు భారత్ చూపు

**అగ్రరాజ్యం నుంచి భారీగా దిగుమతులు**




న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇటీవల చెలరేగిన సంక్షోభం, భారతదేశ ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) దిగుమతి స్వరూపాన్నే మార్చేసింది. సంప్రదాయంగా గల్ఫ్ దేశాలపైనే 90 శాతం ఆధారపడిన భారత్, సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అమెరికా, ఇరాన్ సహా ఇతర దేశాల నుంచి దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. ఈ వ్యూహాత్మక మార్పు సరఫరా భద్రతకు హామీ ఇచ్చినప్పటికీ, దేశీయంగా వినియోగం తగ్గడంతో పాటు ప్రభుత్వ రంగ చమురు సంస్థలపై భారీ ఆర్థిక భారం పడిందని క్రిసిల్ నివేదిక వెల్లడించింది. సంక్షోభం కారణంగా ఫిబ్రవరిలో కేవలం 8 శాతంగా ఉన్న అమెరికా నుంచి దిగుమతుల వాటా, ఏప్రిల్ నాటికి భారతదేశ మొత్తం ఎల్పీజీ దిగుమతుల్లో మూడో వంతుకు (దాదాపు 33శాతం) చేరింది. 2025 చివర్లో భారత్, అమెరికా మధ్య కుదిరిన 2.2 మిలియన్ టన్నుల వార్షిక సరఫరా ఒప్పందం ఇందుకు దోహదపడింది. ఈ ఒప్పందం మన దేశ వార్షిక దిగుమతి అవసరాల్లో 10 శాతాన్ని తీరుస్తుంది. చాలా కాలం తర్వాత ఇరాన్ నుంచి కూడా దిగుమతులు మొదలయ్యాయి. ఏప్రిల్‌లో ఇరాన్ వాటా 6 శాతంగా నమోదైంది. వీటితో పాటు అర్జెంటీనా, చిలీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి కూడా భారత్ ఎల్పీజీ కార్గోలను కొనుగోలు చేసింది. దిగుమతుల వైవిధ్యంతో సరఫరా భద్రత లభించినప్పటికీ, దీనికి దేశం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. సుదూర ప్రాంతాల నుంచి దిగుమతుల కారణంగా రవాణా ఖర్చులు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయంగా వినియోగంపై తీవ్ర ప్రభావం పడింది. ఫిబ్రవరిలో 3.2 మిలియన్ టన్నులుగా ఉన్న ఎల్పీజీ వినియోగం, ఏప్రిల్‌కు 2.47 మిలియన్ టన్నులకు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే మార్చి, ఏప్రిల్ నెలల్లో వినియోగం 13 శాతం చొప్పున తగ్గగా, మే నెలలో ఏకంగా 20శాతం క్షీణించింది. ధరల పెరుగుదల ప్రభావం వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులపై అత్యధికంగా పడింది. మార్కెట్ ఆధారిత ధరలు ఉండటంతో వారు వాడకాన్ని తగ్గించుకున్నారు. అయితే, గృహ వినియోగదారులకు ప్రభుత్వం పరిమితంగానే ధరలు పెంచడంతో వారి నుంచి డిమాండ్ నిలకడగానే ఉంది. సంక్షోభం కారణంగా భారత దిగుమతులకు ప్రామాణికమైన సౌదీ అరామ్కో కాంట్రాక్ట్ ధర ఫిబ్రవరి, జూన్ మధ్య 46 శాతం పెరిగింది. కానీ, దేశీయంగా ఢిల్లీలో 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధర సుమారు 10 శాతం పెరగగా, 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర ఏకంగా 79 శాతం పైగా పెరిగింది. గృహ వినియోగదారులకు ఊరట కల్పించేందుకు ధరలను నియంత్రించడంతో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను చవిచూశాయి. క్రిసిల్ అంచనా ప్రకారం మే నెలలో ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌పై ప్రభుత్వ చమురు సంస్థలు రూ. 651 నష్టపోయాయి. ఈ లెక్కన మార్చి-మే మధ్య కాలంలో ఈ సంస్థలు భరించిన మొత్తం నష్టం సుమారు రూ. 22,000 కోట్లుగా ఉంది.

# శ్రీశాంత్ సవాల్‌కు భజ్జీ కౌంటర్

టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్ విసిరిన సవాల్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తనదైన శైలిలో స్పందించాడు. ఖాళీ కుండుకు సౌండ్ ఎక్కువ అనే సామెతను ఉపయోగిస్తూ అదిరిపోయే కౌంటరిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన చెంపదెబ్బ ఉదంతానికి ఈ ఇద్దరూ కారణమనే విషయం తెలిసిందే. 18 ఏళ్ల క్రితం మైదానంలోనే ఈ ఇద్దరూ గొడవపడ్డారు. తన కంటే జూనియర్ అయిన శ్రీశాంత్‌పై హర్భజన్ సింగ్ చేయి చేసుకోవడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ తర్వాత ఈ ఘటనను మరిచిపోయిన ఈ ఇద్దరూ సన్నిహితంగా మెలిగారు. కలిసి ఇంటర్వ్యూల్లో కూడా పాల్గొన్నారు. కానీ ఈ చెంపదెబ్బ ఘటనను గుర్తు చేసేలా హర్భజన్ సింగ్ ఇటీవల ఒక యాడ్‌లో నటించడం తీవ్ర వివాదాస్పదమైంది. పాత గాయాలు మర్చిపోయారని భావిస్తున్న తరుణంలో భజ్జీ చేసిన ఈ యాడ్ శ్రీశాంత్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీశాంత్.. దమ్ముంటే ఇప్పుడురా.. బాక్సింగ్ రింగ్‌లో చూసుకుందాం అంటూ హర్భజన్ సింగ్‌కు సవాల్ విసిరాడు. 'భజ్జీ.. నేను మీకు సవాలు విసురుతున్నాను. నిజాయతీగా నాతో బాక్సింగ్ రింగ్‌లోకి రా.. సంతకం చేసి బరిలోకి దిగే దమ్ము నీకు ఉందా? . నేను బేర్ నకిల్ ఫైట్ లీగ్‌లో భాగస్వామిని. మలయాళీలు, సర్దార్ల ఆత్మగౌరవం కోసం ఈ సవాల్‌ను స్వీకరించు. నేను రింగ్‌లో నీ కోసం వేచి చూస్తుంటా' అంటూ శ్రీశాంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. అయితే ఈ సవాల్‌కు హర్భజన్ సింగ్ తనదైన శైలిలో కౌంటరిచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ వీడియోను షేర్ చేసిన హర్భజన్ సింగ్.. 'ఎవరో చాలా చక్కగా చెప్పారు... వాగేవాళ్ళను వాగనివ్వండి.. ఎందుకంటే ఎప్పుడూ ఖాళీ కుండలే ఎక్కువ శబ్దం చేస్తాయి'అనే సామెతను హిందీలో చెప్పారు. దాంతో ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే ఈ వీడియోలో హర్భజన్ సింగ్.. శ్రీశాంత్ పేరును ప్రస్తావించకపోయినప్పటికీ అతన్ని ఉద్దేశించే ఈ వీడియో పంచుకున్నట్లు తెలుస్తోంది.

# '8వ పే'.. ఉద్యోగుల డిమాండ్ల పరిశీలన షురూ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం తన కార్యకలాపాలను వేగవంతం చేసింది. ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నుంచి వినతులు, మెమొరాండంలు స్వీకరించే ప్రక్రియ జూన్ 15వ తేదీతో ముగిసింది. ప్రస్తుతం ఈ డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలించే పనిలో కమిషన్ నిమగ్నమైంది. తుది సిఫార్సులు చేసే ముందు ఈ డిమాండ్లన్నింటినీ కూలంకషంగా అధ్యయనం చేయనుంది. 2025 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌కు, తన నివేదికను పూర్తి చేయడానికి దాదాపు 10 నెలల సమయం కేటాయించారు. ఈ సిఫార్సుల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 55 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల వేతనాలు, పెన్షన్లు, ఇతర అలవెన్సులలో మార్పులు జరగనున్నాయి. దీంతో కోటి మందికి పైగా ప్రజలు ఈ కమిషన్ సిఫార్సుల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఉద్యోగ సంఘాలు తమ మెమొరాండంలలో ప్రధానంగా కొన్ని కీలక అంశాలను ప్రస్తావించాయి. ముఖ్యంగా, జీతాల పెంపులో కీలకమైన ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు 3.15 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను అమలు చేయాలని కోరుతున్నాయి. దీంతో పాటు కనీస మూల వేతనాన్ని భారీగా పెంచాలని కూడా విజ్ఞప్తి చేశాయి. అంతేగాక ప్రస్తుతం అమలులో ఉన్న జాతీయ పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్నది ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. వీటితో పాటు ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్ఏ), రిస్క్ పే, బోనస్‌లు, సెలవు ప్రయోజనాలు, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను మెరుగుపరచాలని కోరాయి. వేతన సవరణలో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అత్యంత కీలకం. ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత మూల వేతనాన్ని కొత్త వేతన స్కేల్‌కు మార్చడానికి ఉపయోగించే గుణకాన్నే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అంటారు. ఈసారి ప్రభుత్వం 2.5 కంటే ఎక్కువ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ప్రకటించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఉద్యోగ సంఘాలు మాత్రం 3.15 ఆశిస్తున్నాయి. దీనిపై కమిషన్ ఏ మేరకు సిఫార్సు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే కమిషన్ ఢిల్లీ, లడఖ్, జమ్మూ కశ్మీర్, హైదరాబాద్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాలలో సంప్రదింపులు పూర్తి చేసింది. రానున్న రోజుల్లో జూలై వరకు లక్నో, భువనేశ్వర్, కోల్‌కతాలలో పర్యటించి ఉద్యోగ సంఘాలతో సమావేశం కానుంది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2026 జనవరిలో కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్) 2 శాతం పెంచి, మొత్తం రేటును 60 శాతానికి చేర్చింది. తదుపరి డీఏ పెంపు ఈ ఏడాది మే, జూన్ నెలల ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ గణాంకాలపై ఆధారపడి ఉంటుంది.

# రెబల్ ఎంపీలు పేడ పురుగులు: సంజయ్ రౌత్

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం చెలరేగింది. శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ పార్టీని వీడిన నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ధారాశివ్ ఎంపీ ఓంరాజే నింబాల్కర్, హింగోలి ఎంపీ నగేశ్ పాటిల్ అష్టికర్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. పార్టీ ఇచ్చిన అవకాశాలతోనే రాజకీయంగా ఎదిగిన నేతలు ఇప్పుడు పార్టీని వీడడం ద్రోహమని రౌత్ అన్నారు. ఒకప్పుడు ఉద్ధవ్ ఠాక్రేను ఎప్పటికీ వదిలిపెట్టనని చెప్పిన నేతలే ఇప్పుడు మారిపోయారని ఎద్దేవా చేశారు. "పేడలో పుట్టిన పురుగులు మళ్లీ పేడలోకే వెళ్లాయి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కూడా రౌత్ విమర్శలు సంధించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నా రాజకీయాల్లో పరిస్థితులు ఎప్పుడైనా మారిపోతాయని అన్నారు. ఈ రోజు ఉన్న పదవులు రేపు ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు. షిండేను పెద్ద రాజకీయ నాయకుడిగా చూపించే ప్రయత్నాలను కూడా ఆయన కొట్టిపారేశారు. మరోవైపు పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే కూడా రెబల్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆకర్షించే ప్రయత్నాలు కొనసాగితే 'ఆపరేషన్ టైగర్'కు ప్రతిగా 'ఆపరేషన్ లోటస్' చేపడతామని హెచ్చరించారు.

## నాన్నకు ప్రేమతో..!



# ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో ఫాదర్స్ డే సంబురాలు

**ఉత్సాహంగా పాల్గొన్న తండ్రులు, విద్యార్థులు.. యోగా, మ్యూజిక్ డే వేడుకల నిర్వహణ**

అల్వాల్–హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): నగరంలోని అల్వాల్‌లో ఉన్న ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో శనివారం ఫాదర్స్ డే, అంతర్జాతీయ యోగా దినోత్సవం, ప్రపంచ మ్యూజిక్ డే వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ఆసనాలను ప్రదర్శించి ఆరోగ్యకర జీవనశైలిలో యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని పాటలు, సంగీత ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. ఫాదర్స్ డే సందర్భంగా తండ్రులు–పిల్లల అనుబంధాన్ని ప్రతిబింబించే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తండ్రుల కోసం పాఠశాల యాజమాన్యం పలు వినోదాత్మక ఆటల పోటీలను నిర్వహించింది. ఉత్సాహంగా పాల్గొన్న తండ్రులు తమ పిల్లలతో కలిసి సరదాగా గడిపి ప్రత్యేక అనుభూతిని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డీజీఎం రాధికా రెడ్డి, ప్రిన్సిపాల్ దివ్య మాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ బంధాలను బలోపేతం చేయడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా, వ్యక్తిత్వ వికాసానికి సంగీతం ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఇలాంటి విలువల ఆధారిత కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధిని పెంపొందించేందుకు పాఠశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## యోగాభ్యాసనలో..!





## పిచ్చికుక్క స్వైర విహారం.. 11 మందికి గాయాలు

**బాధితులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శ**

సారంగపూర్, జూన్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 11 మందికి పైగా గాయపరిచింది. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన నెలకొంది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే జగిత్యాల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన అన్ని మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య వసతులు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గాయపడిన వారందరికీ రేబీస్ వ్యాక్సిన్ అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం వీధి కుక్కలకు వ్యాక్సినేషన్‌తో పాటు సంతాన నియంత్రణ చర్యలు చేపడుతోందని వెల్లడించారు. గ్రామాల్లో సంచరించే అనుమానాస్పద కుక్కల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## లోక్ అదాలత్‌లో ఒక్కటైన దంపతులు

ధర్మపురి, జూన్ 20 (ఈవార్తలు): ధర్మపురి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 67 క్రిమినల్ కేసులు, 562 పెట్టి కేసులు రాజీ ద్వారా పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి యేగి జానకి మాట్లాడుతూ "రాజీ మార్గమే రాజమార్గం" అని పేర్కొంటూ ప్రజలు తమ వివాదాలను పరస్పర అవగాహనతో రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో కేసులు పరిష్కారమవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో విడిగా ఉంటున్న ఒక దంపతులు కౌన్సిలింగ్ అనంతరం తిరిగి కలిసి జీవించేందుకు అంగీకరించారు. ఈ ఘటనను ఆమె అభినందిస్తూ, పరస్పర గౌరవం, అవగాహనతో కుటుంబ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఒక కుటుంబం మళ్లీ ఒక్కటవడం లోక్ అదాలత్ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాం నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, ఉదయ్, రవీందర్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందేల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మామిడాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## 23న పాఠశాలల బంద్:ఏబీవీపీ

జగిత్యాల, జూన్ 20 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల నియంత్రణ కోరుతూ ఈనెల 23న రాష్ట్రవ్యాప్త పాఠశాల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాపాక నిఖిల్ తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో టిఫిన్ పథకం అమలు చేయాలని, గురుకులాల్లో వసతులు మెరుగుపరచాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఎన్ఈపీ 2020ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేకులు

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

గంగాధర, జూన్ 20 (ఈవార్తలు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల అన్నదాతలు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. గంగాధర మండలం మధురనగర్‌లో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలపై నిరసనలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఇటీవల కేంద్రం కేటాయించిన కోటా మేరకే ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతుల్లో ఆందోళనకు దారితీసిందని అన్నారు. ఎన్నికల ముందు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు భీమా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి పథకాలతో వ్యవసాయ రంగం బలోపేతమైందని ఆయన పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో నేరుగా వేల కోట్ల రూపాయలు జమ చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన ఘనత గత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం రైతుబంధు అమలులో జాప్యం, రైతు భీమా నిలిపివేత, రుణమాఫీ పూర్తిగా జరగకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత సీజన్‌లో కూడా కొనుగోలు కేంద్రాల్లో అనేక సమస్యలు ఎదురయ్యాయని గుర్తు చేశారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం నెపం నెట్టుకుంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# సమగ్రాభివృద్ధి.. సంక్షేమ పాలన

## మోదీ సర్కారు 12 ఏళ్ల పాలన సరికొత్త దశ.. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్



హైదరాబాద్, జూన్ 20 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో సంక్షేమం, మౌలిక సదుపాయాల విస్తరణ, మహిళా సాధికారత, పారదర్శక పాలన వంటి రంగాల్లో చారిత్రాత్మక పురోగతిని సాధించిందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. శనివారం కవాడిగూడలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)–హైదరాబాద్ నిర్వహించిన 'వార్త' మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం స్వనిధి, పీఎం ముద్రా యోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, జనధన్ యోజన వంటి పథకాల ద్వారా పేదలు, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. ఉజ్వల పథకం కింద 11 కోట్లకు పైగా మహిళలు ప్రయోజనం పొందగా, స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా కోట్లాది కుటుంబాలకు మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చి మహిళల గౌరవం, భద్రత మరింత బలోపేతమయ్యాయని వివరించారు. 81 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భద్రత కల్పించడం వంటి కార్యక్రమాలు ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ చర్యలుగా నిలిచాయని తెలిపారు. జన్ ధన్--ఆధార్--మొబైల్ (జామ్) వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాల నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి పారదర్శకత పెరిగిందన్నారు. లక్ష్యబద్ధమైన సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా గత దశాబ్దంలో సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు.

### తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం

తెలంగాణలో జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యం ఇస్తోందని డాక్టర్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. గత పన్నెండు సంవత్సరాల్లోనే రాష్ట్రంలో సుమారు 5 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను రూ.1.20 లక్షల కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రైల్వే రంగంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం, చర్లపల్లి రైల్వే టర్మినల్ నిర్మాణం, కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ ఏర్పాటు, మెదక్–సిద్దిపేట–కొమురవెల్లి ప్రాంతాలకు రైల్వే అనుసంధాన విస్తరణ వంటి ప్రాజెక్టులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలాగే తెలంగాణకు వందే భారత్ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు హైదరాబాద్‌ను బెంగళూరు, చెన్నై, పుణేతో అనుసంధానించే హైస్పీడ్ రైలు కారిడార్లను కూడా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. మామునూర్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. సబ్‌కా సాథ్ – సబ్‌కా వికాస్ – సబ్‌కా విశ్వాస్ – సబ్‌కా ప్రయాస్ సిద్ధాంతంతో కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

### సమాచార ప్రసారంలో ప్రజల భాగస్వామ్యం కీలకం

కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్ రావు మాట్లాడుతూ, సమర్థవంతమైన సమాచార ప్రసారం, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం మంచి పాలనకు పునాది అని అన్నారు. డిజిటల్ వేదికలు ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజాభిప్రాయాలను తెలుసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, భారతీయ విలువలపై అవగాహన పెంపొందించడంలో విద్యా సంబంధిత కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో తప్పుడు సమాచార వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

### జర్నలిస్టుల నైపుణ్యాల పెంపుకే 'వార్త' కార్యక్రమం

పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్ ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, 'వార్త' కార్యక్రమం ద్వారా ముఖ్యంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల జర్నలిస్టులకు అవగాహన, వృత్తిపరమైన నైపుణ్యాలు, సామర్థ్యాభివృద్ధి కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పథకాల ప్రభావంపై అర్థవంతమైన చర్చలకు ఈ వేదిక దోహదపడుతోందని పేర్కొంటూ, ప్రజలకు కచ్చితమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా ప్రతినిధులు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# రేవంత్‌వి మాటలే చేతల్లేవ్!

**రైతు డిక్లరేషన్ ఏమైంది..?.. బోనస్ హామీపై మాట తప్పారు**

**వ్యవసాయ రంగం గాలికి.. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఫైర్**



జగిత్యాల, జూన్ 20 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని, కాంగ్రెస్ పాలనలో రైతులు వివక్షకు గురవుతున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరిలో అన్ని రకాల ధాన్యాలకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నరకానికే పరిమితం చేయడం రైతుల పట్ల వివక్షేనన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని ప్రభుత్వం సూచించడం సరికాదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేశారని గుర్తు చేశారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కూలీల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఖండించారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం చెప్పిన పంటలనే సాగు చేయాలని సూచించడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిలదీస్తామని తెలిపారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రైతు రాజుగా ఉన్నాడని, కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, పిఏసిఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విజయ లక్ష్మీ, పట్టణ, మండల అధ్యక్షులు అయిల్నేని ఆనంద్ రావు, అనిల్, బర్కాం మల్లేష్, తేలు రాజు, మాజీ ఎంపీపీ మాసర్తి రమేష్, కౌన్సిలర్ రాకేష్ నాయక్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, కల్లేపల్లి దుర్గయ్య, రాధాకిషన్ శీలం సురేందర్, అబ్దుల్ బారీ, రియాజ్ ఖాన్, నేహాల్, శ్రీధర్, మేక పవన్, అనురాధ, రూప తిరుపతి, ప్రణయ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతకు కేంద్రమే కారణం

**11 లక్షల టన్నుల యూరియా ఇచ్చి ఉంటే యాప్ అవసరం లేదు**

**ఎంపీ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు: ఎమ్మెల్యే సంజయ్**



రాయికల్, జూన్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని గుడేటి రెడ్డి సంఘ భవనంలో సీఎం సహాయ నిధి ద్వారా 40 మందికి రూ.12.60 లక్షల విలువైన చెక్కులు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 17 మందికి రూ.17 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం తాట్లవాయి, భూపతిపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి, కిష్టంపేట, మైతాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జగిత్యాల జిల్లాకు 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, రూ.175 కోట్ల నిధులు విడుదలయ్యాయని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులు మాత్రం ఇంకా రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసి ఉంటే రాష్ట్రంలో యాప్ విధానం అవసరం వచ్చేది కాదన్నారు. రాయికల్ మండలానికి రూ.2.30 కోట్లతో పలు ఈజీఎస్ రోడ్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎల్–3 జాబితాలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లుల మంజూరులో కొంత జాప్యం ఉన్నందున కొంతకాలం నిర్మాణ పనులు చేపట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## లోక్ అదాలత్‌లో 146 కేసుల పరిష్కారం

**సఖ్యతతో ముగిసిన సివిల్, క్రిమినల్ కేసులు**

కోరుట్ల, జూన్ 20 (ఈవార్తలు): జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు కోరుట్లలో జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె. పావని అధ్యక్షతన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పక్షకారుల పరస్పర అంగీకారంతో మొత్తం 146 కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. పరిష్కరించిన కేసుల్లో 4 సివిల్, 142 క్రిమినల్ కేసులు ఉండగా, అన్ని కేసులు సఖ్యతతో ముగిశాయి. లోక్ అదాలత్ విజయవంతం కావడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించి, పక్షకారులను రాజీ మార్గంలో సమస్యలు పరిష్కరించుకునేలా ప్రోత్సహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌కు హాజరైన ప్రజలు, పక్షకారులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గొనే రాజేష్ ఖన్నా, కోశాధికారి చింతకింది ప్రేమ్ కుమార్‌తో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట ఆంజనేయులు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు ప్రజలకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించే ఉత్తమ వేదికలని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన న్యాయమూర్తి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పక్షకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

జగిత్యాల, జూన్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. శనివారం జగిత్యాల టౌన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, నేరాల నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తును శాస్త్రీయ ఆధారాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతా కార్యక్రమాల అమలును పరిశీలించారు. జిల్లాలో పెరుగుతున్న వాహన రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలని, ప్రమాద ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్న ఎస్పీ, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని తెలిపారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, ఎస్ఐలు సదాకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA


లవ్లీ చిత్రం


దిశా పటాని



## క్లీంకారా ఫేస్ రివీల్

**టాలీవుడ్ లో మెగా అభిమానులు ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతుల గారాల పట్టి క్లీంకారా కొణిదెల ఫేస్ ను ఫస్ట్ టైమ్ అఫీషియల్ గా ప్రపంచానికి పరిచయం చేశారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఈ క్యూట్ పాప ఫోటోలే వైరల్ అవుతున్నాయి.**

క్లీంకారా పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఎక్కడా ఆమె ముఖం కనిపించకుండా చరణ్, ఉపాసన చాలా జాగ్రత్త పడ్డారు. బయటకు వచ్చినప్పుడు కవర్ చేయడం, సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టినా ఎమోజీలతో దాచేయడం లాంటివి చేస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు ఎలాంటి ముందస్తు హింట్స్ ఇవ్వకుండా నేరుగా ఇన్ స్టాగ్రామ్ లో ఉపాసన ఒక బ్యూటిఫుల్ ఫ్యామిలీ పిక్ ను షేర్ చేశారు. ఇందులో బ్లూ కలర్ డ్రెస్ లో ఉన్న క్లీంకారా చాలా క్యూట్ గా నవ్వుతూ అందరి మనసులు దోచేస్తోంది. నేడు జూన్ 20న క్లీంకారా తన మూడవ పుట్టినరోజు జరుపుకుంటోంది. ఈ మూడేళ్ల బర్త్ డే సందర్భంగానే అభిమానుల కోసం ఈ సర్ప్రైజ్ ఇచ్చినట్లు అర్థమవుతోంది. ఉపాసన తన పోస్ట్ కు హ్యాపీ బర్త్ డే క్లీంకారా అవర్ ప్రెషియస్ లిటిల్ వన్ అంటూ ఎంతో ప్రేమగా ఒక క్యాప్షన్ కూడా జత చేశారు. ఇందులో చరణ్ కూడా తన కూతురిని చూసి ఎంతో మురిసిపోతున్న తీరు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అసలు ఈ పాపకు పెట్టిన పేరుకు ఒక ప్రత్యేకమైన అర్థం ఉన్న సంగతి తెలిసిందే. లలితా సహస్రనామం నుంచి తీసుకున్న క్లీంకారా అనే పదానికి ఒక పవిత్రమైన దైవిక శక్తి అని అర్థం వస్తుంది. చాలా సంప్రదాయబద్ధంగా ఈ నామకరణ వేడుక నిర్వహించారు. ఇక తాతయ్య మెగాస్టార్ చిరంజీవి అయితే ఈ చిన్నారిని ముద్దుగా లిటిల్ మెగా ప్రిన్సెస్ అని పిలుచుకుంటారు. రీసెంట్ గా రామ్ చరణ్ ఉపాసన దంపతుల కుటుంబం మరింత పెద్దదైన విషయం కూడా అందరికీ గుర్తుండే ఉంటుంది. ఈ ఏడాది జనవరిలో వీరికి కవలలు జన్మించారు. అందులో బాబుకు శివరామ్ కొణిదెల అని, పాపకు అన్వీర దేవి కొణిదెల అని పేర్లు కూడా పెట్టారు. ఇద్దరు కొత్త పిల్లల రాకతో ఆనందంలో ఉన్న మెగా ఫ్యామిలీకి ఇప్పుడు క్లీంకారా బర్త్ డే వేడుకలు మరింత సంతోషాన్ని తీసుకొచ్చాయి. ఇక ఈ ఫస్ట్ ఫేస్ రివీల్ తో క్లీంకారాకు సోషల్ మీడియా అంతా బర్త్ డే విషెస్ వెల్లువలా వస్తున్నాయి. కాగా ఇటీవల రామ్ చరణ్ బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన పెద్ది సినిమాతో ప్రేక్షకుల ముందుకు విషయం తెలిసిందే. ఆ సినిమా ఇచ్చిన కిక్ లో ఉన్న అభిమానులకు ఇప్పుడు చరణ్ తన కూతురిని అఫీషియల్ గా చూపించడం డబుల్ ట్రీట్ లా మారింది.

## రఘువరన్ వల్లే సినిమాలకు దూరం

సౌత్ సినీ ఇండస్ట్రీలో నటిగా, రైటర్ గా, డైరెక్టర్గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటి రోహిణి తాజాగా తన పర్సనల్ లైఫ్ లో జరిగిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా నటుడు రఘువరన్తో పెళ్లి తర్వాత ఎందుకు సినిమాలకు దూరమయ్యాననే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రోహిణి, పెళ్లి తర్వాత దాదాపు ఏడు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండటానికి ప్రధాన కారణం రఘువరన్ ఆలోచనా విధానమేనని వెల్లడించారు. పెళ్లి తర్వాత తాను నటిగా కంటిన్యూ అవడానికి ఆయనెప్పుడూ ప్రోత్సహించలేదని, ఇంట్లోనే హౌస్ వైఫ్ గా జీవించాలని ఆయన ఆశించినట్టు రోహిణి వెల్లడించారు. 1996లో రోహిణి, రఘువరన్ పెళ్లి చేసుకున్నారు. ఆ సమయంలో ఇద్దరూ తమ తమ రంగాల్లో అత్యంత గుర్తింపు పొందిన నటులుగా ఉన్నారు. 1998లో వీరికి రిషి అనే కొడుకు పుట్టాడు. అయితే కాలక్రమేణా అభిప్రాయ భేదాలు పెరగడంతో 2004లో వీరిద్దరూ విడిపోయారు. అనంతరం 2008లో రఘువరన్ కన్నుమూశారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ, రఘువరన్ పెరిగిన కుటుంబ వాతావరణమే అతనిపై ప్రభావం చూపిందని తెలిపారు. వారి ఫ్యామిలీలో మహిళలు జాబ్స్ చేయడం లేదా బయటకు వెళ్లి పనిచేయడం సాధారణమైన విషయం కాదని, అదే భావజాలం ఆయనలో కూడా ఉండేదని చెప్పారు.



## కొన్ని మర్చిపోవడమే మంచిది

అక్కినేని వారి కోడలు,నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ వివాహం జరిగినప్పటి నుంచి సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. ఇటీవల 'చీకటిలో' అనే వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేశారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ దర్శకుడు పా రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం'లో శోభిత కూడా నటించనున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుడగా.. ఈ ప్రాజెక్ట్ కాకుండా కొన్ని కథలను కూడా శోభిత వింటున్నట్లు టాక్. ఈ నేపథ్యంలో, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శోభిత ధూళిపాళ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారాయి. ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ ఆమెను ప్రశ్నిస్తూ.. జీవితంలో మీరు ఏ విషయాన్ని మర్చిపోవాలని అనుకుంటున్నారు అని అడిగారు. దానికి శోభిత స్పందిస్తూ.. నిన్నటి వరకు తన జీవితంలో జరిగిన సంఘటనలన్నింటినీ పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నట్లు చెప్పారు.





## తల్లి కాబోతున్న స్టార్ హీరోయిన్ సమంత!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత మళ్లీ వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె ప్రొఫెషనల్ లైఫ్ మాత్రమే కాదు.. పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ఒక క్రేజీ వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సామ్ త్వరలోనే తల్లి కాబోతోందంటూ గత రెండు రోజులుగా నెట్టింట పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. సమంత ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సమంత పాల్గొన్నారు. అయితే ఈ ఈవెంట్‌లో సామ్ కొద్దిగా బేబీ బంప్' (గర్భవతిగా ఉన్నట్లు)తో కనిపించారంటూ కొన్ని ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దీంతో ఆమె ప్రెగ్నెంట్ అంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. స్పందించని సమంత టీమ్.. ఈ వార్తలపై అటు సమంత గానీ, ఇటు ఆమె సన్నిహితులు లేదా దర్శకురాలు నందిని రెడ్డి టీమ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కనీసం ఖండించనూ లేదు. దీంతో ఈ సస్పెన్స్ మరింత పెరిగింది.



## రజనీ-కమల్ ప్రాజెక్టులో నేను లేను

ఇండియన్ సినిమా హిస్టరీలోనే మోస్ట్ పవర్‌ఫుల్ మల్టీస్టారర్ కాంబినేషన్‌గా రాబోతున్న ప్రాజెక్ట్ 'కేహెచ్-ఆర్‌కే'. లోకనాయకుడు కమల్ హాసన్, సూపర్ స్టార్ రజినీకాంత్ కలిసి నటిస్తున్న ఈ క్రేజీ మూవీపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే ఈ సినిమాలో కమల్ హాసన్ కూతురు, స్టార్ హీరోయిన్ శృతి హాసన్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో గట్టిగా పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నేను లేను.. క్లారిటీ ఇచ్చిన శృతి: కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రాబోతున్న 'కేహెచ్‌ఇఆర్‌కే' సినిమాలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తలను శృతి హాసన్ పూర్తిగా ఖండించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "నేను ఇటీవల మా నాన్నగారిని, రజని గారిని కలిసిన విషయం నిజమే.. కానీ నేను ఈ సినిమాలో నటించడం లేదు.

## మనసుకు విశ్రాంతి కావాలి

తమ అభిమానులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండేందుకు సోషల్ మీడియాను ప్రధాన వేదికగా ఉపయోగిస్తున్న సినీ సెలబ్రిటీలు, ఇటీవల కాలంలో అదే సోషల్ మీడియా నుంచి కొంత కాలం దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటున్నారు.



మానసిక ఆరోగ్యం, పర్సనల్ టైమ్, ప్రశాంత జీవనశైలి కోసం సోషల్ మీడియా డీటాక్స్ పేరుతో విరామం తీసుకుంటున్నారు. తాజాగా ఈ లిస్ట్ లో యంగ్ హీరోయిన్ కయాదు లోహర్ కూడా చేరారు. తెలుగు, తమిళం, మలయాళం సహా పలు భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న కయాదు లోహర్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఫ్యాన్స్ తో ఓ ఎమోషనల్ మెసేజ్ ను షేర్ చేసుకున్నారు.

## ఆలియాపై పంచ్‌లే పంచ్‌లు!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ తాజాగా ఒక పబ్లిక్ వేదికపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. భారతదేశంలో మహిళా ప్రాధాన్యత కలిగిన యాక్షన్ సినిమాలకు తానే -పయనీర్- (ఆద్యురాలు) అన్నట్లుగా మాట్లాడిన ఒక వీడియో క్లిప్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. సామాజిక మాధ్యమాల వేదికగా ఈ వీడియోపై నెటిజన్లు రకరకాల పంచ్‌లు, సెటైర్లతో దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. వైరల్ అవుతున్న ఈ వీడియోలో ఆలియా భట్.. భారతదేశంలో మహిళా సెంట్రిక్ యాక్షన్ సినిమాలకు తానే పునాది వేసినట్లుగా సోషల్ మీడియాల్లో వచ్చే కామెంట్లను తాను ఎంతో సంతోషంగా అంగీకరించింది. దీంతో నెటిజన్లు నేపో క్వీన్ అంటూ ఎద్దేవా చేస్తున్నారు. యాక్షన్ జానర్‌లో తనకు మించిన వారు లేరన్నట్లుగా ఆలియా ప్రవర్తించడం చూసి... తోటి - సీనియర్ నటీమణులను గౌరవించడం ఆలియాకు అస్సలు తెలియదంటూ నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.





## టీమిండియా 3-0

### మూడో వన్డేలో జైస్వాల్, రోహిత్ ఊచకోత

భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరిగిన మూడో వన్డేలో భారత జట్టు భారీ విజయం సాధించింది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఆఫ్ఘాన్ జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. వెంట వెంటనే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టుకు కెప్టెన్ హష్మతుల్లా ఆదుకొని సెంచరీ నమోదు చేసకున్నాడు. అలాగే అజ్మతుల్లా కూడా 50 పరుగులతో రాణించడంతో 44.2 ఓవర్లకు 218 పరుగుల వద్ద ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆలౌట్ అయింది. అనంతరం 219 పరుగుల స్వల్ప లక్ష్యంతో చేజింగ్ కు దిగిన భారత ఓపెనర్లు రెచ్చిపోయి ఆడారు. ఐకానిక్ చెపాక్ మైదానంలో పరుగుల వరద పారిస్తూ భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. జైస్వాల్ సెంచరీతో నాటౌట్‌గా నిలవగా..రోహిత్ శర్మ 79 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చి శ్రేయస్ అయ్యర్ 20 పరుగులు చేశాడు. దీంతో భారత్ 28. 4 ఓవర్లలోను లక్ష్యాన్ని చేదించి.. ఆఫ్ఘనిస్తాన్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసి సిరీస్‌ను సొంతం చేసుకుంది.



## రోహిత్ శర్మ హ్యాట్రిక్

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హ్యాట్రిక్‌తో సత్తా చాటాడు. అయితే బౌలింగ్‌లో కాకుండా ఫీల్డింగ్‌లో హ్యాట్రిక్ సాధించాడు. అఫ్గానిస్థాన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న మూడో వన్డేల్లో రోహిత్ శర్మ వరుసగా మూడు క్యాచ్‌లు అందుకున్నాడు. అతని స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో అఫ్గాన్ ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్(5), రెహ్మత్ షా(5), ఇబ్రహీం జద్రాన్(11) వరుసగా పెవిలియన్ చేరారు. ఈ మూడు వికెట్లను ప్రసిధ్ కృష్ణనే తీయడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగగా.. ప్రసిధ్ కృష్ణ ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బతీసాడు. రెండో ఓవర్‌లోనే ఔట్ స్వింగర్‌తో రెహ్మానుల్లా గుర్బాజ్‌ను క్యాచ్ ఔట్ చేశాడు. గుర్బాజ్ డ్రైవ్ ఆడే ప్రయత్నం చేయగా.. బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి ఫస్ట్ స్లిప్‌లో ఉన్న రోహిత్ శర్మ చేతిలో పడింది. ప్రసిధ్ వేసిన ఆరో ఓవర్ ఆఖరి బంతిని రెహ్మత్ షా మిడ్ వికెట్ దిశగా ఫ్లిక్ షాట్ ఆడబోగా.. బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి గాల్లోకి లేచింది. స్లిప్‌లో ఉన్న రోహిత్ ఎడమవైపు జరిగి ఈజీగా అందుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ వేసిన 8వ ఓవర్ రెండో బంతిని ఇబ్రహీం జద్రాన్.. కవర్ డ్రైవ్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి ఫస్ట్ స్లిప్‌లో ఉన్న రోహిత్ శర్మ చేతిలోకి దూసుకెళ్లింది. హ్యాట్రిక్ క్యాచ్‌లు అందుకోవడంతో రోహిత్ శర్మ ఎగిరి గంతేసాడు. ప్రస్తుతం రోహిత్ శర్మకు సంబంధించిన హ్యాట్రిక్ క్యాచ్‌ల వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రోహిత్ శర్మపై ఫ్యాన్స్ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ హ్యాట్రిక్ క్యాచ్‌లతో రోహిత్ శర్మ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఒకే పేసర్ బౌలింగ్‌లో 3 క్యాచ్‌లు పట్టిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. 2004లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో ఇర్ఫాన్ పఠాన్ బౌలింగ్‌లో వీవీఎస్ లక్ష్మణ్ తొలిసారి ఈ ఫీట్ సాధించాడు. 2018లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో శిఖర్ ధావన్ ఈ ఘనతను అందుకున్నాడు. అలాగే ఒకే ఇన్నింగ్స్‌లో తొలి మూడు క్యాచ్‌లు అందుకున్న నాలుగో భారత ప్లేయర్‌గా కూడా రోహిత్ నిలిచాడు. గతంలో సౌరవ్ గంగూలీ, మనోజ్ తివారీ, సురేష్ రైనా ఈ ఫీట్ సాధించారు.






# నాకౌట్‌కు అమెరికా

ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో అగ్రరాజ్యం అమెరికా జోరు కొనసాగుతోంది. గ్రూప్-డి లో భాగంగా సీయాటిల్ స్టేడియంలో శనివారం తెల్లవారుజామున జరిగిన హోరాహోరీ పోరులో అమెరికా 2-0 తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఈ గెలుపుతో గ్రూప్-డీలో అగ్రస్థానంలో నిలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే నాకౌట్‌కు అర్హత సాధించింది.

ఆతిథ్య మెక్సికో తర్వాత ఈ టోర్నీలో నాకౌట్ చేరిన రెండో జట్టుగా నిలిచింది. 96 ఏళ్ల ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో అమెరికా వరుసగా రెండు లీగ్ మ్యాచ్‌లు గెలవడం ఇదే రెండోసారి మాత్రమే. అరంగేట్ర ఫిఫా ప్రపంచకప్(1930)లో బెల్జియం, పరాగ్వేలపై అమెరికా విజయం సాధించింది.

### ఆస్ట్రేలియాపై ఘన విజయం

మళ్లీ ఇన్నేళ్ల తర్వాత (తొలి మ్యాచ్‌లో పరాగ్వేపై 4-1, రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 2-0) బ్యాక్-టు-బ్యాక్ విజయాలు నమోదు చేసింది. స్టార్ ప్లేయర్ క్రిస్టియన్ పులిసిచ్ గాయంతో దూరమైనప్పటికీ అమెరికా అద్భుతమైన ప్రదర్శనతో ఆస్ట్రేలియాను ఓడించింది. మ్యాచ్ ప్రారంభమైన 40వ సెకనులోనే ఆస్ట్రేలియా ప్లేయర్ మహ్మద్ టూరే గోల్ చేసే సువర్ణావకాశాన్ని చేజార్చుకున్నాడు. ఆ తర్వాత పుంజుకున్న అమెరికా 11వ నిమిషంలోనే ఖాతా తెరిచింది. ఫోలారిన్ బాలోగన్ పంపిన లో-క్రాస్‌ను అడ్డుకునే క్రమంలో ఆస్ట్రేలియా డిఫెండర్ కామెరాన్ బర్గెస్ 'సెల్ఫ్ గోల్' చేయడంతో అమెరికాకు 1-0 ఆధిక్యం లభించింది. అనంతరం ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ లెక్కి చేసిన గోల్ ప్రయత్నం తృటిలో చేజారింది. ఫస్టాఫ్ ముగియడానికి సరిగ్గా రెండు నిమిషాలు ఉందనగా.. (43వ నిమిషంలో)సెర్గినియో డెస్ట్ కొట్టిన షాట్ గాల్లోకి లేవగా, దానిని అలెక్స్ ఫ్రీమాన్ హెడర్ ద్వారా గోల్‌గా మలిచాడు. మొదట దీనిని ఆఫ్‌సైడ్‌గా భావించినప్పటికీ, వీఏఆర్ సమీక్ష తర్వాత గోల్‌గా ప్రకటించడంతో అమెరికా 2-0తో తిరుగులేని ఆధిక్యంలోకి వెళ్ళింది. 1994 తర్వాత ప్రపంచకప్‌లో అమెరికా తరఫున ఒక డిఫెండర్ గోల్ చేయడం ఇది రెండోసారి మాత్రమే. సెకండాఫ్‌లో ఆస్ట్రేలియా సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు క్రిస్టియన్ వోల్పాటో, కానర్ మెట్‌కాఫ్ ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసినా అమెరికా డిఫెన్స్ లైన్‌ను దాటలేకపోయారు. చివరి నిమిషాల్లో ఆస్ట్రేలియా పట్టుదలగా ఆడినప్పటికీ గోల్స్ నమోదు చేయడంలో విఫలమైంది. ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్ చేసిన అమెరికా జూన్ 25న లాస్ ఏంజిల్స్‌లో టర్కీతో తన తదుపరి మ్యాచ్ ఆడనుంది. మరోవైపు, ఆస్ట్రేలియా తన నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే పరాగ్వేపై తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.





## బ్రెజిల్ విక్టరీ

### 3-0 గోల్స్ తేడాతో హైతీపై విన్

ఫిఫా వరల్డ్‌కప్‌లో జరిగిన గ్రూప్ సీ మ్యాచ్‌లో.. బ్రెజిల్ జట్టు విజయం సాధించింది. 3-0 గోల్స్ తేడాతో హైతీపై విక్టరీ కొట్టింది. బ్రెజిల్ ప్లేయర్ మాథ్యూస్ కున్హా రెండు గోల్స్ చేశాడు. మొరాకోతో జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో బ్రెజిల్‌పై విమర్శలు వచ్చాయి. ఆ మ్యాచ్ డ్రా కావడంతో ప్లేయర్లు సరిగా పర్ఫార్మ్ చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైతీతో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ ఆటగాళు దూకుడు పెంచారు. ఆ జట్టులో వినిసియస్ జూనియర్ మరో గోల్ చేశాడు. స్ట్రయికర్ ఇగోర్ థియాగో స్థానంలో ఆడిన కున్హా.. 23వ నిమిషంలోనే తొలి గోల్ చేశాడు. హైతీ డిఫెండర్ హన్నెస్ డిల్‌క్రాక్స్‌కు బంతి తగిలి నెట్‌లోకి దూసుకెళ్లింది. వినిసియస్ జూనియర్ ఇచ్చిన ఓ పాస్‌ను .. టాప్ కార్నర్ షాట్‌తో కున్హా గోల్‌గా మలిచాడు. ఫస్ట్ హాఫ్ స్టాప్ చేసే సమయంలో వినిసియస్ జూనియర్ ఓ గోల్ కొట్టాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ ప్లేయర్ రాఫినా గాయపడ్డాడు. అతని స్థానంలో రయాన్‌ను ఆడించారు. బ్రెజిల్ కీపర్ అలిసన్ అద్భుతంగా చేశాడు. రెండో ఓటమితో ఈ టోర్నీ నుంచి హైతీ నిష్క్రమించినట్లు అయ్యింది. గ్రూపు సీలో ఆ జట్టు ఇంకా ఖాతా తెరవలేదు.

## అన్విత సరికొత్త రికార్డు

భారతీయ పర్వతారోహకురాలు పడమటి అన్విత మరో ప్రతిష్టాత్మక మైలురాయి పూర్తి చేసింది. 19 జూన్‌న ఉత్తరఅమెరికాలోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరం మౌంట్ డెనాలీ (6,190 మీటర్లు) ను విజయవంతంగా అధిరోహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఏడుఖండాలలోని ఎత్తైన శిఖరాలను అధిరోహించే ప్రతిష్టాత్మక 'సెవెన్సమిట్స్ఛాలెంజ్'లో భాగంగా ఆమె సాధించిన 6వ శిఖరం ఇది. ఈ విజయంతో, ప్రపంచంలోని ఏడు ఖండాల అత్యున్నత శిఖరాలను అధిరోహించిన కొద్ది మంది భారతీయ మహిళల జాబితాలో చేరడానికి ఆమె మరో అడుగు దూరంలో నిలిచారు. యాదాద్రి-భువనగిరి జిల్లా, భువనగిరి పట్టణానికి చెందిన మధుసూదన్ రెడ్డి, చంద్రకల దంపతుల కుమార్తె. తనకుటుంబం అందించిన నిరంతర ప్రోత్సాహం, మద్దతుతోనే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని అన్విత పేర్కొన్నారు. తన సాధించిన విజయాలకు గాను గతంలో తెలంగాణ ప్రభుత్వం నుండి 'వుమెన్ పురస్కార్ అవార్డు', అలాగే అప్పటి గవర్నర్ డాక్టర్ తమిళసై సౌందరరాజన్ చేతుల మీదుగా 'బెస్ట్ అచీవర్ అవార్డు'ను కూడా ఆమె అందుకున్నారు.

## రోనాల్డోకు కొత్త కాదు: రూబెన్

పేలవ ఫామ్‌తో సతమతమవుతూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ కెప్టెన్ క్రిస్టియానో రోనాల్డోకు ఆ జట్టు డిఫెండర్ రూబెన్ డయాస్ అండగా నిలిచాడు. ఈ విమర్శలు, మీడియా ఒత్తిడి రోనాల్డోకు కొత్త కాదని, తన కెరీర్‌లో ఇలాంటి కఠిన పరిస్థితులను ఎన్నో ఎదుర్కొన్నాడని తెలిపాడు. ఫలితాలు అనుకూలంగా లేనప్పుడు ఇలాంటి విమర్శలు రావడం సహజమని, వాటిని తాము అస్సలు పట్టించుకోమని స్పష్టం చేశాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పోర్చుగల్ తమ తొలి మ్యాచ్‌లో తీవ్రంగా నిరాశపర్చింది.

## ఇంగ్లండ్‌కు హార్దిక్ దూరం!

ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ పర్యటనకు దూరంగా ఉండనున్నాడు. వెన్ను నొప్పితో ఇబ్బంది పడుతున్న హార్దిక్ పాండ్యా.. 50 ఓవర్ల క్రికెట్ ఫార్మాట్‌కు కావాల్సిన పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌ను సాధించలేకపోయాడని తెలుస్తోంది. ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ల కోసం టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇప్పటికే టీ20 సిరీస్ ఆడే భారత జట్టును ప్రకటించిన సెలెక్టర్లు.. వన్డే టీమ్ ఎంపికపై కసరత్తులు చేస్తున్నారు. అయితే టీమ్ సెలెక్షన్‌కు హార్దిక్ పాండ్యా అందుబాటులోకి రాలేదని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు సారథ్యం వహించిన హార్దిక్ పాండ్యా వెన్ను నొప్పితో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. ఐపీఎల్ ముగిసిన వెంటనే బెంగళూరులోని క్రికెట్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో రిహాబిలిటేషన్ తీసుకున్నాడు. వెన్ను నొప్పి నుంచి పూర్తిగా కోలుకున్న హార్దిక్ పాండ్యా.. ఫిట్‌నెస్ నిరూపించుకునే క్రమంలో మరోసారి గాయపడినట్లు వార్తలు వచ్చాయి. నెట్స్‌లో 10 ఓవర్ల కోటాను పూర్తి చేసినప్పటికీ, అతని గాయం తిరగబెట్టినట్లు తెలుస్తోంది. దాంతో అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు.



నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# నైపుణ్యాలకు విలువివ్వాలి

మన విద్యా వ్యవస్థలో ఇప్పటికీ మార్కులు, ర్యాంకులు, పరీక్షల ఫలితాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థి ప్రతిభను అతను సాధించిన మార్కులతోనే కొలిచే ధోరణి సమాజంలో బలంగా కొనసాగుతోంది. అయితే మారుతున్న ప్రపంచంలో కేవలం పుస్తక జ్ఞానం సరిపోదు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన వంటి జీవిత నైపుణ్యాలు కూడా అంతే అవసరం. అందుకే పాఠశాలలు పరీక్షలకంటే నైపుణ్యాల పెంపుపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి ఉద్యోగ ప్రపంచంలో సంస్థలు కేవలం డిగ్రీలు లేదా మార్కులనే చూడడం లేదు. జట్టుగా పని చేయగలగడం, కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, సాంకేతికతను సమర్థంగా వినియోగించడం వంటి లక్షణాలను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటున్నాయి. కానీ మన పాఠశాలల్లో ఇప్పటికీ కంఠస్థం చేసి పరీక్షలు రాయడానికే విద్యార్థులను సిద్ధం చేసే విధానం కొనసాగుతోంది. దీనివల్ల మార్కులు వచ్చినా, ఆ జ్ఞానాన్ని జీవితంలో ఉపయోగించుకునే సామర్థ్యం చాలా మందిలో పెరగడం లేదు. అయితే పరీక్షలను పూర్తిగా పక్కన పెట్టాలనే వాదన కూడా సరైనది కాదు. పరీక్షలు విద్యార్థి నేర్చుకున్న అంశాలను అంచనా వేయడానికి ఒక సాధనం. కానీ అవే విద్యకు అంతిమ లక్ష్యంగా మారకూడదు. ఒకే రోజు జరిగే పరీక్ష ఆధారంగా విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించడం అన్యాయం. నిరంతర మూల్యాంకనం, ప్రాజెక్టులు, ప్రయోగాత్మక పనులు, ప్రజెంటేషన్లు, క్రీడలు, కళలు, సామాజిక సేవ వంటి అంశాలను కూడా మూల్యాంకనంలో భాగం చేయాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పోటీ పరీక్షల ఒత్తిడి కారణంగా చిన్న వయసులోనే విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కోచింగ్ సెంటర్ల సంస్కృతి, మార్కుల కోసం జరిగే పోటీ, తల్లిదండ్రుల అంచనాలు పిల్లల్లో ఆందోళనను పెంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్య ఆనందదాయకమైన అభ్యాస ప్రక్రియగా కాకుండా భయాన్ని కలిగించే వ్యవస్థగా మారుతోంది. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు నైపుణ్యాధారిత విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అక్కడ విద్యార్థులను ప్రశ్నలు అడగడానికి, పరిశోధన చేయడానికి, సృజనాత్మకంగా ఆలోచించడానికి ప్రోత్సహిస్తారు. భారతదేశం కూడా అదే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. జాతీయ విద్యా విధానం కూడా అనుభవాత్మక అభ్యాసం, బహుముఖ నైపుణ్యాలు, వృత్తి విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం సానుకూల పరిణామమే. అయితే విధానాలు కాగితాలకే పరిమితం కాకుండా తరగతి గదుల్లో అమలుకావాలి. పాఠశాలలు విద్యార్థులను పరీక్షల్లో ఉత్తీర్ణులు చేయడమే కాకుండా, జీవితంలో విజయవంతులుగా తీర్చిదిద్దే బాధ్యతను కూడా నిర్వర్తించాలి. మార్కులు తాత్కాలిక గుర్తింపునిస్తాయి; కానీ నైపుణ్యాలు జీవితాంతం అవకాశాలను సృష్టిస్తాయి. అందువల్ల విద్యా వ్యవస్థ పరీక్షలు మరియు నైపుణ్యాల మధ్య సమతుల్యతను పాటిస్తూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించే దిశగా ముందుకు సాగాలి. అదే నిజమైన విద్యకు, దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుంది.

# నీటి నిర్వహణలో సంస్కరణలు అవసరం



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధికి వ్యవసాయ రంగం వెన్నెముక. ఆ వ్యవసాయానికి ప్రాణాధారం నీరు. అయితే వాతావరణ మార్పులు, అస్థిర వర్షపాతం, భూగర్భ జలాల అధిక వినియోగం, నదీ జలాల పంపిణీపై వివాదాలు, పాతబడిన సాగునీటి వ్యవస్థలు వంటి కారణాలతో నీటి నిర్వహణ నేడు అత్యంత కీలకమైన అంశంగా మారింది.

**ఈ నేపథ్యంలో నీటి వనరుల సమర్థ వినియోగం, సాగునీటి సంస్కరణలు, శాస్త్రీయ ప్రణాళికలు అమలు చేయడం తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుకు అత్యవసరం. గత కొన్నేళ్లుగా రెండు రాష్ట్రాలు భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాయి.**

కొత్త రిజర్వాయర్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, కాలువల ఆధునీకరణ వంటి చర్యలు చేపట్టాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయానికి ఊతమిచ్చినప్పటికీ, కేవలం ప్రాజెక్టుల నిర్మాణమే శాశ్వత పరిష్కారం కాదు. నిల్వ చేసిన నీటిని సమర్థంగా పంపిణీ చేయడం, చివరి ఎకరం వరకు అందించడం, వృథాను నివారించడం కూడా అంతే ముఖ్యం. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలపైనే రైతులు ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో చెరువులు, కాలువలు, భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడం, భూగర్భ జల మట్టాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించడం, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించడం కాలానుగుణ అవసరం. సూక్ష్మ సాగు పద్ధతులు, ముఖ్యంగా డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ వంటి సాంకేతికతలను విస్తృతంగా అమలు చేస్తే నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అయితే చిన్న, సన్నకారు రైతులకు వీటి ఖర్చు భారం కాకుండా సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందించాలి. అదే సమయంలో వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెంచాలి. శతాబ్దాలుగా గ్రామీణ జీవనానికి ఆధారమైన చెరువులను కాపాడటం నీటి భద్రతకు కీలకం. మరో ప్రధాన సమస్య రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు. కృష్ణా, గోదావరి జలాల వినియోగంపై తరచూ తలెత్తే భేదాభిప్రాయాలు రాజకీయ రంగు పులుముకుంటున్నాయి. అయితే నీటి సమస్యను రాజకీయ ప్రయోజనాల కోణంలో కాకుండా శాస్త్రీయ డేటా, పరస్పర సహకారం, న్యాయబద్ధమైన పంపిణీ ఆధారంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో పనిచేస్తే రెండు రాష్ట్రాల రైతులకూ ప్రయోజనం చేకూరుతుంది. పట్టణాల్లోనూ నీటి నిర్వహణ సవాళ్లు పెరుగుతున్నాయి. జనాభా విస్తరణతో తాగునీటి డిమాండ్ పెరుగుతుండగా, వర్షపు నీరు కాలువల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తోంది. వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు, మురుగునీటి శుద్ధి చేసి పునర్వినియోగం, పరిశ్రమల్లో నీటి పొదుపు చర్యలు తప్పనిసరి కావాలి. నీటి ప్రతి చుక్కను విలువైన వనరుగా పరిగణించే సంస్కృతి ఏర్పడితేనే భవిష్యత్ సంక్షోభాన్ని నివారించవచ్చు. ప్రభుత్వాలు భారీ ప్రాజెక్టుల ప్రకటనలకే పరిమితం కాకుండా వాటి నిర్వహణ, పారదర్శకత, నిర్వహణ వ్యయాలపై కూడా దృష్టి పెట్టాలి. నీటి వినియోగంపై డిజిటల్ మానిటరింగ్, రైతులకు రియల్‌టైమ్ సమాచారం, కాలువల మరమ్మతులు, స్థానిక నీటి వినియోగ సంఘాల బలోపేతం వంటి సంస్కరణలు అవసరం. అలాగే నీటి లభ్యతకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను రూపొందించి, మార్కెట్ మద్దతుతో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి. నీటి నిర్వహణ అనేది కేవలం ఇంజినీరింగ్ ప్రాజెక్టుల అంశం కాదు; అది ఆర్థికాభివృద్ధి, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ జీవనోపాధితో ముడిపడి ఉన్న సమగ్ర బాధ్యత. నేడు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాలకు నీటి భద్రతను నిర్ధారిస్తాయి. రాజకీయ సంకల్పం, శాస్త్రీయ ప్రణాళిక, రైతుల భాగస్వామ్యం, ప్రజల సహకారం కలిసివస్తేనే తెలుగు రాష్ట్రాలు నీటి వనరులను సుస్థిరంగా వినియోగించి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయగలవు. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే.

- డాక్టర్ బాలసాయి, సాగు నీటి రంగ నిపుణుడు, హైదరాబాద్




# ప్రజా రవాణే పరిష్కారం

**పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల సంఖ్యలో విపరీతమైన వృద్ధి, పరిమిత రహదారులు-ఈ మూడు కలిసి నేటి నగరాల ముందున్న అతిపెద్ద సవాళ్లుగా మారాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ వంటి నగరాల్లో ప్రతిరోజూ ట్రాఫిక్ రద్దీ ప్రజల సమయాన్ని, ఇంధనాన్ని, ఉత్పాదకతను మింగేస్తోంది. అదే సమయంలో వాహనాల నుంచి వెలువడే కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.**

ఈ రెండు సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం ఏదైనా ఉంటే అది బలమైన, అందుబాటులో ఉండే, నమ్మకమైన ప్రజా రవాణా వ్యవస్థే. మన దేశంలో వ్యక్తిగత వాహనాల వినియోగం వేగంగా పెరుగుతోంది. ఒకప్పుడు విలాసంగా భావించిన కారు లేదా బైక్ నేడు అవసరంగా మారింది. అయితే ప్రతి ఒక్కరూ తమ సొంత వాహనంలో ప్రయాణిస్తే నగరాల రహదారులు ఎంత విస్తరించినా సరిపోవు. ఫలితంగా ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు, ఇంధన వృథా, గాలి కాలుష్యం వంటి సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఉద్యోగుల పనితీరు, విద్యార్థుల సమయపాలన, అత్యవసర సేవల నిర్వహణ కూడా దెబ్బతింటున్నాయి. ప్రజా రవాణా ఈ సమస్యలకు సమర్థవంతమైన ప్రత్యామ్నాయం. ఒక బస్సు లేదా మెట్రో రైలు వందలాది మంది ప్రయాణికులను ఒకేసారి గమ్యస్థానాలకు చేర్చగలదు. దీనివల్ల రోడ్లపై వ్యక్తిగత వాహనాల సంఖ్య తగ్గి ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా ఒక్కో ప్రయాణికుడికి అయ్యే ఇంధన వినియోగం, కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయి. వాతావరణ మార్పుల ముప్పు పెరుగుతున్న ఈ కాలంలో ప్రజా రవాణాను ప్రోత్సహించడం పర్యావరణ పరిరక్షణలో కీలక అడుగు. అయితే ప్రజలు తమ వ్యక్తిగత వాహనాలను వదిలి బస్సు లేదా మెట్రో ఎక్కాలంటే కేవలం పిలుపులు సరిపోవు. ప్రభుత్వాలు సౌకర్యవంతమైన, సమయపాలన పాటించే, భద్రత కలిగిన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థను అందించాలి. బస్సుల సంఖ్య పెంచడం, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించడం, మెట్రో, లోకల్ రైలు, బస్సుల మధ్య సమన్వయం పెంచడం వంటి చర్యలు అవసరం. చివరి మైలు కనెక్టివిటీ లేకపోతే ప్రజలు తిరిగి వ్యక్తిగత వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న నగరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రజా రవాణాపై భారీ పెట్టుబడులు పెట్టాలి. ఎలక్ట్రిక్ బస్సులు, ప్రత్యేక బస్ లేన్లు, సైక్లింగ్ ట్రాక్‌లు, పాదచారులకు అనుకూలమైన మౌలిక వసతులు కల్పిస్తే నగరాల జీవన నాణ్యత మెరుగుపడుతుంది. ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాయు కాలుష్యం తగ్గి ప్రజారోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. ప్రజా రవాణా అనేది కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు; అది సామాజిక సమానత్వానికి, ఆర్థిక అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు కూడా పునాది. విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, వృద్ధులు-ప్రతి వర్గానికీ అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థ నగరాలను మరింత సమర్థవంతంగా మారుస్తుంది. రోడ్లను విస్తరించడం ఒక్కటే పరిష్కారం కాదు. ఎంత రహదారులు నిర్మించినా వ్యక్తిగత వాహనాల సంఖ్య అదే వేగంతో పెరిగితే సమస్య మళ్లీ మొదటికొస్తుంది. అందుకే భవిష్యత్ నగరాల అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజా రవాణాను కేంద్రబిందువుగా ఉంచాలి. ట్రాఫిక్ రద్దీని తగ్గించాలన్నా, కాలుష్యాన్ని నియంత్రించాలన్నా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నా ప్రజా రవాణాకు ప్రత్యామ్నాయం లేదు. ప్రభుత్వ సంకల్పం, ప్రజల సహకారం కలిస్తేనే ఈ మార్పు సాధ్యమవుతుంది. ప్రజా రవాణాను అలవాటు చేసుకోవడం అనేది కేవలం వ్యక్తిగత ఎంపిక కాదు-సమాజం, పర్యావరణం, రాబోయే తరాల పట్ల మన బాధ్యత కూడా.



- అలేఖ్య కట్కం, జర్నలిస్టు


రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.